విశాలాంధ్ర

ఏలూరు, పశ్చిమ గోదావరి
కాకినాడ, కోనసీమ
తూర్పుగోదావరి

శనివారం 10 మే 2025 8 పేజీలు

నీటి సంఘాల నిర్వీర్యం

- ఉత్సవ విగ్రహాల్లా నీటి సంఘాల అధ్యక్షులు
- కాల్వల మరమ్మతులు... నీటి పంపిణీలో భాగస్వామ్యం లేదాయే !

విశాలాంధ్ర బ్యూరో -ఏలూరు: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిధిలోని నీటి సంఘాల అధ్యక్షులతో అధికారులు వ్యవహరిస్తున్న తీరు... అధికారుల సమాధానాలతో నీటి సంఘాల అధ్యక్షులు కంగుతింటున్నారు. అధికారుల తీరుతో నీటి సంఘాల బాధ్యులు ఆందోళన చెందుతున్నారు. అసలు తాము నీటి సంఘాల ఆధ్యకులమా కాదా..తనకు అధికారాలు ఉన్నాయా లేవా. అని ఆయోమయంలో ఉన్నారు. ఓ పథకం ప్రకారం నీటి సంఘాలను నిర్వీర్యం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయన్న ఆందోళన ఎన్నికైన వారిలో వ్యక్తమౌతోంది. అధ్యక్షుల పరిస్థితి ఉత్సవ విగ్రహాల చందాన ఉందన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వ లక్ష్యాల మేరకు కాల్వల నిర్వహణలో, నీటి పంపిణీలోభాగస్వాములను చేయాలని సంఘాల అధ్యక్షులు కోరుతున్నారు. సకాలంలో వర్షాలు కురిస్తే వర్షాలు కురిసే లోపలే కాల్వల మరమ్మతులు పూర్తి చేయాల్సి ఉంటుంది. ఏ కాలువలో..ఏ పనులు చేపట్టాలనే విషయంలో సంఘాలకు పూర్తి అవగాహన ఉంటుంది. రైతుల ద్వారా సమస్యలు తెలుసుకుని పనులు చేపడితే సాగుదారులకు నీటి ఇబ్బందులు ఉండవు. ఆ దిశగా జలవనరుల శాఖ స్పందించడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. కనీసం నీటి సంఘాలతో సమావేశాలు నిర్వహించేందుకు కూడా అధికారులు ఇష్టపడటం లేదని పలువురు అధ్యక్షులు వాపోతున్నారు. నీటి సంఘాలను నిర్వీర్యం చేసేలా అధికార యంత్రాంగం వ్యవహరిస్తోందని నీటి సంఘాల అధ్యక్షులు విమర్శిస్తున్నారు.

ప్రభుత్వ లక్ష్యానికి విరుద్ధంగా అధికారులు

సాగునీటి వ్యవస్థను బలోపేతం చేసేందుకు కూటమి ప్రభుత్వం ఐదు నెలల క్రితం నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించింది. కాల్వల నిర్వహణ,సాగునీటి పంపిణీలో సంఘాలను భాగస్వాములను చేయాలని ప్రభుత్వం సంకల్పించింది. రైతులకు దగ్గరగా ఉంటూ సాగునీటి సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయడంతో పాటు, కాల్వల మరమ్మతులు, చివరి ఎకరం వరకు సాగునీటిని

▶మిగతా 2లో..

ఉపాధి హామీ కూలి ధరలు పెంచాలి

మన్నవ కృష్ణ చైతన్య

విశాలాంధ్ర - వేలేరుపాడు : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కూలి ధరలను పెంచాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో శుక్రవారం మండల కౌన్సిల్ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణ చైతన్య, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వర్రావు మాట్లాడారు. ముందుగా పాకిస్తాన్ యుద్ధంలో వీరమరణం చెందిన జవాన్‌కు మౌనం పాటించి నివాళులర్పించారు. ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న పేద కుటుంబాలకు ధరలు పెంచి వారి కుటుంబ పోషణ భారం కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. ఉపాధి హామీ కూలీలకు రోజు కూలి 600 రూపాయలు అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. అప్పుడే ఆయా కుటుంబాలకు పనికి తగిన కూలి అందుతుందన్నారు. పెద్దవాగు

▶మిగతా 2లో..

ఉపాధి కూలీల బకాయిలను చెల్లించాలి

కామవరపుకోటలో

గణపవరంలో

జంగారెడ్డిగూడెంరూరల్

విశాలాంధ్ర-కామవరపుకోట: ఉపాధి హామీ కూలీల బకాయిలు తక్షణమే చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం (బి.కె.ఎం.యు) జిల్లా కార్యదర్శి కుంచే వసంతరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.మండు వేసవిలో చెరువుల్లో మట్టి పనులు చేస్తున్న ఉపాధి హామీ కూలీలకు ఏడాదికి 200 రోజులు ఉపాధి హామీ పనులు కల్పించడంతోపాటు కనీస వేతనం రూ.700 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎండలో పనిచేస్తున్న కూలీలకు త్రాగునీరు సరఫరాతో పాటు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు కార్మికులకు అందించాలన్నారు. ఎఐటియుసి జిల్లా కార్యదర్శి కంకిపాటి బుచ్చిబాబు మాట్లాడుతూ ఉపాధి కార్మికులకు అవసరమైన సదుపాయాలు కల్పించాలన్నారు. ఉపాధి హామీ కూలీలకు కనీస వేతనం రూ.700 ఇవ్వాలని, ఏడాదికి 200 రోజులు పని కల్పించాలని గత కొన్ని నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాకు కార్మికులంతా తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. సీపీఐ మండల కార్యదర్శి టీవీఎస్ రాజు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేయడానికి ఉద్దేశపూర్వకంగా కేంద్ర ప్రభుత్వం నిధులు తగ్గిస్తుందని అన్నారు. ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించాలని, పనిచేసే ప్రాంతంలో మెడికల్ కిట్స్ మహిళా కార్మికులకు అవసరమైన సదుపాయాలు కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కృష్ణ భదర్ రావు,మగతల కృష్ణమ్మ,ముళ్ళ గిరి కృష్ణ,మగతల నరసమ్మ,లలిత తదితరులు పాల్గొన్నారు.

గణపవరం: మహాత్మా గాంధీ

▶మిగతా 2లో..

యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు

మంత్రి కందుల దుర్గేష్

విశాలాంధ్ర - నిడదవోలు : రాష్ట్రంలోని నిరుద్యోగులందరికీ ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించడానికి కూటమి ప్రభుత్వం జాబు మేళాలను నిర్వహిస్తుందని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. శుక్రవారం నిడదవోలులోని వెలగపూడి దుర్గాంబ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో వికాస జేకేసీ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్ మేళా కు ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి దుర్గేష్ కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ శుక్రవారం నిర్వహించిన మెగా జాబ్ మేళాకు దాదాపు 42 కంపెనీలు హాజరయ్యాయని , ఆయా కంపెనీల్లో 2000కు పైగా ఉద్యోగాల కల్పనకు అవకాశముందన్నారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న జాబ్ మేళాలో ఐటీ రంగానికి చెందిన కంపెనీలు అధికంగా వచ్చాయని, తదుపరి విడతలో జరిగే జాబ్ మేళాలో టూరిజం, అతిథ్య

రంగాలకు సంబంధించిన కంపెనీలను ఆహ్వానిస్తామన్నారు. ఐదేళ్లలో రాష్ట్రంలో 20 లక్షల మంది యువతకు ఉద్యోగాల కల్పన కోసం ఐదుగురు మంత్రులతో కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేసినట్లు మంత్రి దుర్గేష్ తెలిపారు. ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల కల్పన అంశంపై మంత్రి నారాలోకేష్ ప్రత్యేక శ్రద్ధ వహించారని మంత్రి దుర్గేష్ గుర్తుచేశారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న జాబ్ మేళాలో అన్ని రకాల విద్యార్థులకు

▶మిగతా 2లో..

హాస్టల్ వార్డెన్ మృతి అనుమానాస్పదం

సీపీఐ జిల్లా కార్యదర్శి బోడకొండ

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం సూరంపాలెంలోని ఓ ప్రైవేటు కళాశాలకు చెందిన బాలికల హాస్టల్ వార్డెన్ నిందుకొండ మల్లిక ది అనుమానాస్పద ఆత్మహత్య అని సీపీఐ జిల్లా కార్యదర్శి బోడకొండ అన్నారు. వివరాల ప్రకారం గురువారం రాత్రి మల్లిక తన రూమ్‌లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుందని కాలేజీ యాజమాన్యం రాత్రి 2 గంటల సమయంలో తల్లిదండ్రులకు సమాచారం అందించారని, పెద్దాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారని పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆసుపత్రి వద్ద సీపీఐ, అఖిల భారత విద్యార్థి సమాఖ్య, బంధువులతో కలిసి ధర్నా నిర్వహించారు. అనంతరం మీడియాతో బోడకొండ మాట్లాడుతూ వార్డెన్ మల్లిక ఆత్మహత్య

చేసుకుందని కాలేజి యాజమాన్యం పోలీస్‌లకు ఫిర్యాదు చేయలేదని ఇది కాలేజి యాజమాన్యం వారి హత్యే అని తల్లితండ్రులు, బంధువులు ఆరోపించారు. మల్లిక తల్లిదండ్రులు నిరుపేద దళిత కుటుంబానికి వారని, ఆ కుటుంబానికి తగిన న్యాయం చేయాలని, ఈ ఘటనపై వెంటనే విచారణ జరిపించాలని బోడకొండ డిమాండ్ చేశారు. దీనికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని సీపీఐ, అఖిల భారత విద్యార్థి సమాఖ్య గా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు ఎం. రమణ, అఖిల భారత విద్యార్థి సమాఖ్య రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్, కోనసీమ జిల్లా ఉపాధ్యక్షులు సతీశ్, శ్యామ్ బాబు పాల్గొన్నారు.

యుద్ధానికి ప్రజల సంఘీభావం

విశాలాంధ్ర-లింగపాలెం: భారత్, పాక్ మధ్య జరుగుతున్న యుద్ధంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. లింగపాలెం మండలంలోని పల్లెల్లో, గ్రామాలలో యుద్ధానికి సంబంధించి ఏం జరుగుతుందనే ఆత్రుత ప్రజల నుంచి వ్యక్తమవుతున్నది. సామాన్యులు, పాలకులు, రాజకీయ నాయకులు, అధికారులు, ఉద్యోగులు ఇలా ప్రతి ఒక్కరూ యుద్ధంలో భారత విజయం సాధించాలని కోరుకుంటున్నారు. పాకిస్తాన్ వక్ర బుద్ధిని, చేస్తున్న దుస్సాహసాన్ని తీవ్రంగా విమర్శిస్తున్నారు. పాకిస్తాన్ వల్ల అమాయకులైన భారత్ ప్రజలు బలైపోతున్నారని ఎంతకాలం వీరి ఆగడాలకు బలవ్వాలని అంటున్నారు.

వీర జవాన్‌కు జోహార్లు: దేశ రక్షణలో వీరమరణం పొందిన సత్యసాయి జిల్లాకు చెందిన జవాన్ మురళి నాయక్‌కు ప్రతి ఒక్కరూ నివాళులు అర్పిస్తున్నారు. సెల్యూట్ మురళి...నీ త్యాగం... నీ సాహసం...భారతా వనికి గర్వంగా నిలుస్తుం దంటూ కొనియాడారు.

కృష్ణాపురంలో ఘనంగా మహారాణా ప్రతాప్ జయంతి వేడుకలు

విశాలాంధ్ర-టి.నరసాపురం: టి నరసాపురం పంచాయతీలోని కృష్ణాపురం గ్రామంలో రాజపుత్ర వీరుడు మహారాణా ప్రతాప్ 486వ జయంతిని బంజారా భజరంగీభేరీ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బంజారా భజరంగీ భేరీ నాయకులు భూక్యా వేణుగోపాల్ మాట్లాడుతూ మొఘలాయి సామ్రాజ్యాన్ని ఎదిరించి పరాయి పాలనలో బానిసలుగా ఉండకుండా స్వతంత్రంగా జీవించాలని జీవితకాలం పోరాటం చేసిన మొట్టమొదటి భారత స్వతంత్ర యోధుడు మహా రాణా ప్రతాప్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో భూక్యా రామ కృష్ణ నాయక్, భూక్యా రాములు నాయక్, భూక్యా భిగ నాధం నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కౌమార బాలికలకు అవగాహన సదస్సు

విశాలాంధ్ర -భీమవరం: తుందుర్రు గ్రామంలోని మూడవ అంగన్వాడీ కేంద్రంలో కిషోర ప్రాయ బాలికలకు శుక్రవారం వేసవి తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్వైజర్ వి.కనకమహాలక్ష్మి, ఎఎన్ఎం జ్యోతి కిషోరీ బాలికల వ్యక్తిగత పరిశుభ్రత, కౌమార దశలో రక్త హీనత, పోషకాహారం తదితర అంశాలపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్స్ ఎం.వజ్ర కుమారి, ఎన్.కనక దుర్గ, ఐ.అన్నపూర్ణ, ఆశా కార్యకర్తలు, తదితరులు, బాలికలు పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాలు (1వ పేజీ తరువాయి)

సంబంధించిన ఉద్యోగ అవకాశాలున్నాయన్నారు. 1989లో ఏర్పాటు చేసిన వికాస ద్వారా ఇప్పటివరకు దాదాపు 2 లక్షలకు పైగా ప్రైవేట్ రంగాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించామని వివరించారు. మాజీ శాసనసభ్యులు, తెలుగుదేశం పార్టీ ఇంచార్జి బూరుగుపల్లి శేషారావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగాలు కల్పిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో నిడదవోలు మున్సిపల్ ఛైర్మన్ భూపతి ఆదినారాయణ, వికాస పీడీ కె.లచ్చారావు, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి జీవీడి మురళి, ఎస్వీఆర్ కె బాలుర కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.జ్యోతి, ఎస్వీడీ మహిళా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రుద్ర, కూటమి నాయకులు పి. నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ధరలు పెంచాలి (1వ పేజీ తరువాయి)

ప్రాజెక్టును తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాలు సమన్వయంతో వెంటనే మరమ్మత్తులు చేపట్టాలన్నారు. వేల ఎకరాలకు వ్యవసాయ భూమికి నీరు అందించే ఆ ప్రాజెక్టుపై ఇరు రాష్ట్ర ప్రభుత్వాలు శ్రద్ధ వహించాలన్నారు. ప్రాజెక్టు తెగటం వలన వందల ఎకరాల పంటలు సక్రమంగా పండక రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ సాగు కాలం నాటికి ప్రాజెక్టు పనులు పూర్తి చేసి రైతులకు వ్యవసాయం చేసేందుకు మనోధైర్యం ఇవ్వాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సూపర్ సిక్స్ పథకాలను వెంటనే అమలు చేయాలన్నారు. ప్రతి పథకాన్ని కూటమి ప్రభుత్వం అమలు చేసి తమ చిత్తశుద్ధి నిరూపించుకోవాలన్నారు. ప్రజా సంఘాలను మరింత బలోపేతం చేయాలన్నారు. అప్పుడే ప్రజా సమస్యల పరిష్కారానికి బలం చేకూరుతుందన్నారు. ముఖ్యంగా పోలవరం ప్రాజెక్టు నిర్వాసిత సమస్యలు, పోడు భూముల పట్టాలు కోసం పోరాటాలు ఉధృతం చేయాలన్నారు. జూలై 5,6,7 న చింతలపూడిలో నిర్వహించే జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎండి మునీర్, జిల్లా కార్యవర్గ సభ్యులు సన్నేపల్లి సాయిబాబు, రామవరం సర్పంచ్ పిట్టా ప్రసాద్, మండల కార్యదర్శి బాడిశ రాము, కౌన్సిల్ సభ్యులు పిట్టా వీరయ్య, బంధం అర్జున్, మడివి కామయ్య, షేక్ గౌస్, ప్రసాద్, చిన్నమ్మి తదితరులు పాల్గొన్నారు.

నిర్వీర్యం (1వ పేజీ తరువాయి)

అందించడంలో కీలకపాత్ర పోషించాలని ప్రభుత్వం నీటి సంఘాలకు సూచించింది. ఇది నిజమే కదా అని ఆయా పనులు చక్కబెట్టేందుకు ప్రయత్నిస్తున్న సాగునీటి సంఘాలకు జల వనరుల శాఖ అధికారుల నుంచి అడ్డంకులు ఎదురవుతున్నాయని కొందరు అధ్యక్షులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాల్వల నిర్వహణ పనులను గుర్తించడం,నీటి తీరువా వసూళ్లలో నీటి సంఘాలను భాగస్వాములను చేయాలని ప్రభుత్వం సూచిస్తోంది. అయితే ప్రభుత్వ లక్ష్యాలను జల వనరుల శాఖ తుంగలో తొక్కుతుందన్న విమర్శలు వస్తున్నాయి.

నిధులు... అధికారాలు లేవు...

రైతులు ఏటా చెల్లించే నీటి తీరువాలో 80 శాతం నిధులను నీటి సంఘాలకు కేటాయించాలి. ఈ ప్రక్రియను అమలు చేసే పరిస్థితులు కానరావడం లేదని అధ్యక్షులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సాగునీటి వినియోగదారుల సంఘాలు, డిస్ట్రిబ్యూటరీ కమిటీలు,ప్రాజెక్టు కమిటీలకు నిర్దిష్టమైన అధికారాలను ప్రభుత్వం కల్పించినా వాటిని కొందరు హరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.పైగా అధికారుల తీరు సంఘాలను అవమానించేలా ఉన్నాయన్న విమర్శలు వెల్లు వెత్తుతున్నాయి. ప్రభుత్వ యంత్రాంగం ఇకనైనా తక్షణం అందించి వ్యవసాయ సీజన్ ప్రారంభమయ్యే నాటికి నేటి సంఘాల సమావేశాలు నిర్వహించి నిర్దిష్ట ప్రణాళిక తయారుచేసి నీటి సంఘాల అధ్యక్షులను భాగస్వాములను చేయాలని కోరుతున్నారు.

బకాయిలు చెల్లించాలి (1వ పేజీ తరువాయి)

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంలో పని చేస్తున్న శ్రామికుల సమస్యలు తక్షణమే ప్రభుత్వం పరిష్కారం చేయాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి కళింగ లక్ష్మణరావు ప్రభు త్వాన్ని కోరారు. ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర సమితి ఆదేశాల మేరకు ఈనెల 9,10,11 తేదీలలో కార్మికుల పని ప్రదేశాల్లో పరిశీలించి సమస్యలు తెలుసుకొని 12 తేదీన జిల్లా కలెక్టర్‌కు కార్మికులు చెప్పిన సమస్యలను వినతి పత్రం రూపంలో ఇవ్వాలని పిలుపులో భాగంగా శుక్రవారం గణపవరం మండలంలో సిహెచ్ అగ్రహారం, పిప్పరు, వెంకటరాజ పురం, మొయ్యేరు ప్రదేశాల్లో పనిచేస్తున్న శ్రామికులతో మాట్లాడి వారు తెలిపిన సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన శ్రామికుల ఉద్దేశించి మాట్లాడుతూ ఈ చట్టం పేద ప్రజలకు రెండు పూట్ల భోజనం చేయడానికి ఏర్పాటు చేసిన ఈ చట్టం రోజు రోజుకు శ్రామికులకు దూరమయ్యే విధంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. చట్టంలో ఉన్న ప్రకారం పని రోజులు, పనిముట్లు,పని ప్రదేశంలో సౌకర్యాలు, కల్పించడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బడ్జెట్లో నిధులు తగ్గించడం,ఇతర రంగాలకు ఈ నిధులు మళ్ళించడం వలన శ్రామికుల జీవన జీవన ప్రమాణం మీద తీవ్ర దిగువ స్థాయిలో పడిపోయాయని ఆయన అన్నారు.ఈ సమస్యల పరిష్కారానికి కేంద్ర రాష్ట్రాలపై ఒత్తిడి తీసుకొచ్చి చట్టం కాపాడుకోవాలని అప్పుడే పేద ప్రజలకు కనీసం న్యాయం జరుగుతుందని ఆయన వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు దిద్దే నాగేశ్వర రావు, శ్రామికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలోని పంగిడిగూడెం గ్రామంలో శుక్రవారం ఉపాధి హామీ కూలీలు వద్ద (బి.కె.యం యు.)అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర పిలుపుమేరకు సిపిఐ జంగారెడ్డిగూడెం మండల కార్యదర్శి జంపన వెంకటరమణ రాజు ఆధ్వర్యంలో (బి.కె.యం.యు)అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బాలయేసు ఉపాధి హామీ కూలీలతో మాట్లాడి అక్కడ పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ ఏర్పాటు చేసి దాహార్తిని తీర్చారు.ఈ సందర్భంగా బాలయేసు మాట్లాడుతూ ఉపాధి హామీల్లో జరుగుతున్న అక్రమాలు, వారికి రావలసిన కూలీ,చట్టంలో పొందుపరిచిన అంశాలు గురించి,వాటిని అమలు చేయాలని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేస్తుందన్నారు. ఉపాధి పథకం ద్వారానే అర్హులైన పేదలందరికీ వంద రోజులు పని దినం కల్పిస్తూ చట్టం చేసినట్టు తెలిపారు. కానీ 100 రోజుల పని దినాల్ని పూర్తిగా అమలు చేయడం లేదని మండిపడ్డారు. బిజెపి ప్రభుత్వం పని దినాల్ని, కూలి పెంచకుండా రాను రాను తగ్గిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఏడాది బడ్జెట్లో రూ. 1,27 వేల కోట్లు కేటాయిస్తే, ఈ ఏడాది రూ. 75 వేల కోట్లు మాత్రమే పెట్టార న్నారు. రానున్న రోజుల్లో రోజుకు రూ.700 కూలి ఇవ్వాలని,200 రోజులు పని దినాలు కల్పించాలని, ప్రతి వ్యవసాయ కూలీకి భృతి కింద ఏడాదికి రూ. 12 వేలు అందజేయాలని సిపిఐ మండల కార్యదర్శి జంపన వెంకటరమణరాజు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బాల యేసు తెలిపారు.ఈ కార్యక్రమంలో గుదే ఆశీర్వాదం, నెట్ రామారావు,కుంచె పాప,కలపర్తి భీమార్జున, కుంచె సహోవా, గద్ద వెంకటలక్ష్మి,గోలిమే స్వప్న, ప్రభాకరరావు, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ కార్డులకు దరఖాస్తులు

విశాలాంధ్ర -భీమవరం: జిల్లాలో రేషన్ కార్డులు లేనివారు క్రొత్త రేషన్ కార్డులకు, రేషన్ కార్డుల్లో మార్పులు, చేర్పులకు గ్రామ/వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేయాలని జిల్లా పౌరసరఫరాల అధికారి ఎన్.సరోజ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో అర్హులై ఉండి ఇప్పటివరకు రేషన్ కార్డులు పొందని వారు, రైస్ కార్డులు కలిగిన కార్డుదారులు తమ గ్రామ సమీపంలోని గ్రామ లేదా వార్డు సచివాలయాలను సందర్శించి వారికి అవసరమైన చేర్పులు, మార్పులకు దరఖాస్తులు చేసుకోవాలని ఆమె సూచించారు.

ఏపీటీఎఫ్ ధర్నా

విశాలాంధ్ర -భీమవరం: ప్రభుత్వం పాఠశాలలను 9 రకాలుగా వర్గీకరించడం లోపభూయిష్టంగా ఉందని దీన్ని వెంటనే ఉపసంహ రించుకోవాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు జి.ప్రకాశం డిమాండ్ చేశారు. మే 5వ తేదీ నుంచి జరుపుతున్న ఆందోళనల్లో భాగంగా ఏపీటీఎఫ్ అధ్వర్యంలో ఉపాధ్యాయులు శుక్రవారం కలెక్టరేట్ వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్కో పాఠశాలలో ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తి వేరువేరుగా ఉంటుందని, ఇటువంటి నిర్ణ యాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలను మంజూరు చేయాలని, 12వ పీఆర్సీని ఏర్పాటు చేయాలని, మధ్యంతర భృతిని ప్రకటించాలని వారు కోరారు. ప్రధాన కార్యదర్శి బి.వి.నారాయణ మాట్లాడుతూ సిపిఎస్‌ను రద్దుచేసి ఓపిఎస్‌ని అమలు చేయాలని, రిటైర్ అయిన ఉద్యోగ ఉపాధ్యాయులకు సంబంధించిన ఆర్థిక బకాయిలైన డిఏ బకాయిలు, పీఆర్సీ బకాయిలు ,ఆర్జిత సెలవు నగదు బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గౌరవాధ్య క్షులు పి ఎన్ వి ప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షులు లంక రాజు, కండి బోయిన రాంబాబు, పోతురాజు, దేవదాసు, కార్యదర్శులు పి.జనార్దన స్వామి, వి.రామ్మోహన్, సత్యనారాయణ, వీరభద్రరావు పి.వి.రాఘవులు, నరేంద్ర ,జోసెఫ్, మోజస్ వివిధ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మెగా డీఎస్సీ -2025 ఉచిత ఆన్‌లైన్ కోచింగ్

విశాలాంధ్ర -భీమవరం: జిల్లా పరిధిలోని బి.సి., ఈ.బి.సి. నిరుద్యోగం ఉపాధ్యాయులకు డీఎస్సీ- 2025 పరీక్షలకు ఉచిత ఆన్ లైన్ కోచింగ్ నిమిత్తం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు బి.సి. సంక్షేమ సాధిరత అధికారి జి.వి.ఆర్.కె.యస్.యస్.గణపతి రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలక్టరేట్‌లోని తమ కార్యాలయంలో దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. అభ్యర్థులు తమ 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, బి.ఈడీ, టీ.టీ.సి, టెట్. మార్కుల జాబితా, ఆదాయం, కుల, నివాస ధృవీకరణ పత్రములు సమర్పించాలన్నారు. జిల్లాలోని బి.సి., ఈ.బి.సి., వీరితో పాటు ఎస్సీ, ఎస్టి సామాజిక వర్గాలకు చెందిన అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 8247368943, 8106677598 నెంబర్లలో సంప్రదించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

గర్భిణీలు వేసవిలో తగు జాగ్రత్తలు తీసుకోవాలి

వైద్యాధికారి సిహెచ్. వి.రంగం నాయుడు

విశాలాంధ్ర - పాలకోడేరు : ఈ వేసవిలో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నందున గర్భం దాల్చిన ప్రతి స్త్రీ తప్పనిసరిగా తగు జాగ్రత్తలు తీసుకోవాలని పాలకోడేరు మండల ప్రాథమిక వైద్యాధికారి సిహెచ్. వి.రంగం నాయుడు అన్నారు. ప్రతి నెల తొమ్మిదవతేదీన నిర్వహించే ప్రధానమంత్రి మాతృత్వ సురక్ష అభియాన్ కార్యక్రమంలో భాగంగా సుమారు 40 మంది గర్భిణీలను పరీక్షించి రక్త పరీక్షలు చేయించి, మందులు పంపిణీ చేశారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యవసర పరిస్థితులలో బయ టికి వెళ్లాలంటే ఉదయాన్నే వెళ్లి 10 గంటల లోపు గమ్యస్థానానికి చేరుకోవాలన్నారు. అధిక ఉష్ణోగ్రత నమోదవుతున్నందున శరీరంలోని నీరు చెమట రూపంలో బయటికి అధికంగా రావడం వల్ల శరీర ఉష్ణోగ్రతలలో సమతుల్యత ఏర్పడి ప్రమాదం సంభవించే అవకాశం ఎక్కువగా ఉన్నందున సరైన ఉష్ణోగ్రతను తగ్గించే పానీయాలు గర్భిణీలు ఎక్కువగా సేవించడం వల్ల గర్భిణీకి, లోపల పెరిగే శిశువుకు ఈ వేసవిలో ఎలాంటి అనారోగ్య సమస్యలు కలుగకుండా ఉంటాయన్నారు. ప్రతి గర్భిణీ స్త్రీ పౌష్టికాహారం తీసుకోవాలని ముఖ్యంగా పండ్లు, ఆకుకూరలు, ఐరన్ శాతం, పీచు పదార్థం ఎక్కువగా ఉండే ఆహార పదార్థాలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు డాక్టర్ స్వర్ణ నిరంజని, సిహెచ్ ఓ సత్యనారాయణ, హెల్త్ సూపర్వైజర్లు, హెచ్ వీలు, ఏఎన్ఎం లో, ఆశా కార్యకర్తలు, అంగన్వాడి సిబ్బంది పాల్గొన్నారు.



విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కొనాలి

కలెక్టర్ చదలవాడ నాగరాణి

విశాలాంధ్ర -భీమవరం: విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు జిల్లా, మండల, గ్రామ స్థాయి అధికారులు, సిబ్బంది అవగాహనతో ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు.

శుక్రవారం భీమవరం కలెక్టరేట్ నుండి కలెక్టర్ విపత్తుల నిర్వహణపై అవగాహన శిక్షణ తరగతులను గూగుల్ మీట్ ద్వారా జిల్లా, డివిజన్, మండల, స్థాయి అధికారులు, సిబ్బందికి నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విపత్తుల కారణంగా జిల్లాలో ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు తీసుకోవలసిన జాగ్రత్తలను శిక్షణ తరగతుల ద్వారా తెలియజేస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరు ప్రతి అంశాన్ని కూలంకషంగా అర్థం చేసుకొని క్షేత్రస్థాయిలో అమలు చేసేలా అవగాహన పొందాలన్నారు. జిల్లాలో వరదలు, తుఫానులు, ఉరుములు, మెరుపులు కారణంగా ఏ ఒక్క ప్రాణిని కోల్పోకూడ దని, విపత్తుల సమాచారం మారుమూల ప్రాంతాలకు సైతం చేరేంతగా వ్యవస్థను సిద్ధం చేసుకోవాలన్నారు. జూమ్ కాన్ఫరెన్స్ లో డిఆర్ఓ మొగిలి వెంకటేశ్వర్లు, జిల్లా గ్రామ వార్డు సచివాల యాల అధికారి వై.దోసిరెడ్డి, డ్వామా పి.డి డాక్టర్ కెసిహెచ్ అప్పారావు, డిపిఓ బి.అరుణశ్రీ, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి బి.శ్రీనివాసరావు, జిల్లాలోని అన్ని మున్సిపల్ కమిషనర్లు, తహసిల్దార్లు, ఎంపీడీవోలు, వైద్య శాఖ సిబ్బంది, డ్వామా శాఖ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యానికి శారీరక వ్యాయామం

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : వ్యక్తిగత శారీరక వ్యాయామాలను అలవాటు చేసుకోవాలని పొంగుటూరు సెక్టర్ అంగన్వాడి కేంద్రాల సూపర్వైజర్ అంబటి సరస్వతి తెలిపారు. కిషోరి వికాసం 2.0 కార్యక్రమాన్ని

మండలంలో గంగన్నగూడెం అంగన్వాడి కేంద్రం వద్ద నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన సరస్వతి మాట్లాడుతూ కిషోరి బాలికలకు పోషణ సమతుల ఆహారంతో పాటు, శారీరక వ్యాయామాలు కూడా చేయాలని అన్నారు. బాలికలలో పోషక ఆహార లోపం, రక్తహీనత చికిత్స, కౌమార స్థితిలో ఉన్న బాల బాలికల పోషకాహార స్థితిని మెరుగుపరిచేం దుకు, ఉద్దేశించిన ప్రభుత్వ పథకాలు, బాలిక రక్ష, బేటీ బచావో, బేటీ పడావో, మిషన్ వాత్సల్య, స్పాన్సర్షిప్, చైల్డ్ హెల్ప్ లైన్ 1098 , బాలసదనాలు, మొదలగు పథకాల గురించి వివరించారు. కిషోరి బాలికలు పోషక ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్తలు, ఆశా కార్యకర్త, మహిళా పోలీస్, ఏఎన్ఎం, ఎ.డబ్ల్యు.డబ్ల్యు, చిన్నారుల తల్లిలో పాల్గొన్నారు.

తూనికలు, కొలతల మోసాలపై అవగాహన

విశాలాంధ్ర-ఏలూరు: ఉప నియంత్రకులు, సహాయ నియంత్రకులు ఏలూరు,సహాయ నియంత్రకులు భీమవరం, పరిశీలకులు వారు తూనికలు కొలతల వినియోగం, రైతు బజార్ చికెన్,మటన్, కిరాణా షాపులలో వివిధ వ్యాపారస్తులు వివిధ రకములైన మోసాలపై అవగాహన కల్పిస్తూ స్థానిక డిమార్ట్ లో అవగాహన సదస్సు నిర్వహించారు. ప్యాకేజీలపై ముద్రించ వలసిన తయారీదారుని పేరు,ప్యాకేజీ చేయబడిన వస్తువు పేరు, దాని నికర బరువు,ప్యాకేజీ తయారు చేయబడిన తేదీ ఎమ్మార్పీ ధర కన్స్యూమర్ కంప్లైంట్స్ కై ఉండవలసిన సెల్ ఫోన్ నెంబర్,ఇ మెయిల్ తదితరాలపై అవగాహన కల్పించారు.ఎమ్మార్పీ ధర కంటే ఎవరు ఎక్కువ అమ్మకూడదని వారికి వివరించారు.ఈ కార్యక్రమంలో ఉప నియంత్రకులు హరిప్రసాద్, సహాయనియంత్రకులు సాయి రామ్,సహాయ నియంత్రకులు, భీమవరం, వివి నాగ రాజా రావు,పరిశీలకులు ప్రశాంత్, కట్టా సత్యనారాయణ,న్యాయవాది, కన్వీనర్,కో కన్వీనర్ ఎం. జోసెఫ్, ఏలూరు జిల్లా వినియోగదారుల సంఘాల సమాఖ్య వారు పాల్గొన్నారు.

20న సమ్మె జయప్రదం చేయాలి

ఏఐటీయూసీ డిమాండ్

విశాలాంధ్ర - నరసాపురం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల పట్ల అనుసరిస్తున్న వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 20న దేశవ్యాప్తంగా కార్మిక సంఘాలు సమ్మెకు పిలుపు ఇచ్చాయని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర నాయకులు నెక్కంటి సుబ్బారావు అన్నారు.

నరసాపురం మున్సిపల్ కార్యాలయం వద్ద శుక్రవారం మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు.దేశవ్యాప్తంగా 13 జాతీయ కార్మిక సంఘాలు,ఇతర ప్రజా సంఘాలు సమ్మెలో పాల్గొంటున్నా యన్నారు. 44 కార్మిక చట్టాలను 4 లేబర్ కోడ్ లుగా చేయడానికి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఉపసంహరించు కోవాలన్నారు. ప్రభుత్వ సంస్థలను ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తున్నామన్నారు. రాష్ట్రంలో ఉద్యోగ,కార్మికుల పెండింగ్ సమస్యలు ఉన్నాయన్నారు. మున్సిపల్ ఉద్యోగులకు మూడేళ్లుగా సరెండర్ లీవులు,పెండింగ్ డీఏ,అలవెన్సులు ఇవ్వకుండా దీర్ఘకాలంగా

కొనసాగిస్తున్నారు. దేశంలో కార్మిక ఐక్యత చాటుతూ ఈ నెల 20న దేశవ్యాప్తంగా సమ్మె జరుగుతుందన్నారు. ఏపీలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ సంఘం పాల్గొంటున్నారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ అంజయ్య కు సమ్మె నోటీసు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఆరేటి మృత్యుంజయరావు, వై.రాము,ఎన్. శివప్రసాద్, జి. శ్రీనివాసరావు, ఎల్. రత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాల్లోని పిల్లలను సొంత బిడ్డల్లా చూడండి

కార్యదర్శి కె.రత్న ప్రసాద్

విశాలాంధ్ర ప్రతినిధి -ఏలూరు : వసతి గృహాల్లో ఉంటున్న వారిని కన్న బిడ్డల్లాగా చూసుకోవాలని పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాదు అన్నారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల ప్రకారం న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శుక్రవారం స్థానిక శనివారపేటలోని ప్రభుత్వ బాలుర వసతి గృహాన్ని సందర్శించి వండిన ఆహార పదార్థాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్యదర్శి రత్న ప్రసాద్ మాట్లాడుతూ పిల్లలకు సంరక్షణ, వైద్యం, విద్య, శిక్షణ అభివృద్ధి మరియు పునరావాసం కోసం గృహాన్ని ఏర్పాటు చేశారని ప్రతి నెల ఈ వసతి గృహాన్ని సందర్శించి బాలలకు అందుతున్న సేవలు, సౌకర్యాలపై విచారించాల్సి ఉందన్నారు. అందులో భాగంగా వసతి గృహాన్ని సందర్శించడం జరిగిందని, అలాగే అబ్జర్వేషన్ హోమ్ లో ఉన్న బాలలకు, చట్టంతో విభేదించిన బాలలకు అందుబాటులో ఉన్న న్యాయ సహాయం, వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. బెయిల్ గ్రాంటు అయి పూచీకత్తు పెట్టుకోలేని బాలలకు

ప్రత్యామ్నాయ మార్గాలపై చర్చించాల్సి ఉందన్నారు.

వసతి గృహంలో బాలురకు వేసవి సెలవు లలో నైపుణ్యాన్ని పెంపొందించుకోవడానికి సాంకేతిక విద్యను బోధించాలని వసతి గృహ అధికారులకు ఉమ్మడి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాదు సూచించారు. ఈ కార్యక్రమంలో వసతి గృహ అధికారి, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రుణాల కోసం దరఖాస్తు చేసుకోండి

విశాలాంధ్ర -ఏలూరు : ఎస్సీ కార్యాచరణ ప్రణాళికలో భాగంగా షెడ్యూల్ కులాలకు చెందిన ప్రజలు ఓబిఎంఎస్ పోర్టల్ లో రుణాల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎస్సీ కార్పొరేషన్ ఈడి ఎం.ముక్కంటి చెప్పారు. శుక్రవారం స్థానిక ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో సదరు లక్ష్యాలు పూర్తి చేసేందుకు షెడ్యూల్ కులాలకు చెందిన కుల పెద్దలతో ఆయన సమావేశం అయ్యారు. ఓబిఎంఎస్ పోర్టల్లో నమోదైన దరఖాస్తులు సంఖ్య పరిశీలించగా కొన్ని పథకాలు దరఖాస్తులు లక్ష్యాల మేరకు నమోదు కాలేదన్నారు. ప్రభుత్వ ఉత్తర్వులు, మార్గదర్శకాలను ఆయన వివరించారు. యస్.సి కార్యాచరణ ప్రణాళికలో పేర్కొన్న కొన్ని పథకాలు లక్ష్యాల మేరకు దరఖాస్తులు నమోదు



కాలేదని అందువల్ల ఆ పథకాల లక్ష్యాలను చేరుకోవడానికి విస్తృత ప్రచారం చేసి వారి ప్రాంతాల్లో ఉన్న చదువుకున్న నిరుద్యోగులకు తెలియజేయాలని షెడ్యూల్డు కులాలకు చెందిన ఎస్సీ సంఘాలును, కుల పెద్దలను ఆయన కోరారు. దరఖాస్తు ప్రక్రియ మే 10వ తేదీన ముగుస్తున్నందున ఆసక్తి కలిగిన షెడ్యూల్డు కులాలకు చెందిన వారు త్వరపడి ఆర్థిక రుణ సహాయం కోసం దరఖాస్తులు నమోదు చేసుకోవాలని ముక్కంటి కోరారు.

ఉగ్రవాదం నశించాలి

ప్రపంచ శాంతి వర్ధిల్లాలి

భారత సైనికులకు న్యాయవాదుల సంఘీభావం

విశాలాంధ్ర - జంగారెడ్డిగూడెం రూరల్: ఉగ్రవాదం నశించాలి ప్రపంచ శాంతి వర్ధిల్లాలంటూ ఆపరేషన్ సింధూర్ పాకిస్తాన్తో

వీరోచితంగా పోరాడుతున్న భారత సైనికులకు సంఘీభావం తెలుపుతూ జంగారెడ్డిగూడెం బార్ అసోసియేషన్ న్యాయవాదులు శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు జిఎస్ఆర్ మూర్తి మాట్లాడుతూ ఉగ్రవాదం నశించాలి ప్రపంచ శాంతి వర్ధిల్లాలి అంటూ ఆపరేషన్ సింధు పాకిస్తాన్తో వీరోచితంగా పోరాడుతున్న భారత సైనికులకు అందరం మద్దతుగా నిలవాలని ఇది న్యాయవాదులు ఒక్కరే కాదు ప్రతి ఒక్కరు బాధ్యతగా తీసుకొని భారతీయులందరూ స్పందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు జిఎస్సార్ మూర్తి, ప్రెసిడెంట్ మోదేపల్లి నాగులు, జనరల్ సెక్రటరీ విత్తనాల రాజు, సీనియర్ న్యాయవాదులు పొన్న లక్ష్మణరావు,ఎన్ వి బియల్ ఆచారి, టి ఎస్ ఎన్ మూర్తి, కేవీఆర్, కోటేశ్వరరావు, ఎంజీఆర్ అచ్యుత శ్రీనివాసరావు,జవ్వాల బాబ్జి, రాయి వసంతరావు, రాంబాబు,మాంద్రమోహన్ రావు, వింజమూరి కిరణ్ కిషోర్ ,బొడ్డు శ్రీనివాసరావు, తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారిగా ఓంకార్‌నాథ్

విశాలాంధ్ర - గణపవరం: గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అసిస్టెంట్ సివిల్ సర్జన్ (రెండవ వైద్యాధికారి)గా డాక్టర్ కమతం ఓంకార్ నాథ్ ఉద్యోగ బాధ్యతలు స్వీకరించినట్లు ఆరోగ్య కేంద్రం ప్రధాన వైద్యాధికారి డాక్టర్ పల్లికొండ కిరణ్మయి శుక్రవారం తెలిపారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 24 గంటలు ఆసుపత్రిలో ఎక్కువ ఓపి ఉంటుందన్నారు. బాధ్యతగా రోగు లను చూడాలని ఆమె

సూచించారు. డాక్టర్ ఓంకార్ నాథ్ మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరుగు అన్ని కార్యక్రమాల గురించి తెలుసుకుని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి సూచనలు ప్రకారం చేస్తానని, ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంలో తనకు కేటాయించిన గ్రామాలలో వైద్య సేవలు అంది స్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ జాలాది విల్సన్ బాబు, హెచ్ వి పద్మజ, హెల్త్ అసిస్టెంట్ ఎమ్ ఎస్ యోహాన్, గేదెల శ్రీనివాస్, ఎం. నల్లయ్య, శ్రీనివాస్, ధనుంజయ్ పాల్గొన్నారు.

పాక్ పై కేంద్రం చర్యలకు రైతు కార్యాచరణ సమితి మద్దతు

విశాలాంధ్ర -భీమవరం టౌన్: పాకిస్తాన్ కు తగు విధంగా బుద్ధి చెప్పేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలకు ఆంధ్రప్రదేశ్ రైతు కార్యాచరణ సమితి రౌండ్ టేబుల్

సమావేశం పూర్తి మద్దతును ప్రకటించింది. శుక్రవారం భీమవరం రెండో పట్టణంలో రైతు కార్యాచరణ సమితి గౌరవాధ్యక్షులు కలిదిండి గోపాలకృష్ణంరాజు అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. అధ్యక్షులు పాతపాటి మురళీ రామరాజు మాట్లాడుతూ ఉగ్రవాదుల దాడికి ప్రతీకారంగా భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ సింధూర్‌కు సంఘీభావం తెలియజేస్తున్నామని అన్నారు. రౌండ్ టేబుల్ సమావేశంలో సమితి నాయకులు తమ్మినేని నాగేశ్వరరావు, పెన్మెత్స అప్పలరాజు, కమలాకర్ శర్మ, బిహెచ్ సత్యనారాయణ రాజు, కోళ్ల సీతారామ్, పేరిచర్ల లక్ష్మణవర్మ, గంటా సుందర్ కుమార్, వడ్డీ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

నేడో రేపో ఉపాధ్యాయుల బదిలీల జీవో విడుదల

విశాలాంధ్ర -ఏలూరు : రాష్ట్రవ్యాప్తంగా టీచర్ల బదిలీలు, పదోన్నతులకు సంబంధించిన జీవో ఒకటి రెండు రోజుల్లో వెలువడనుంది.కమిషనర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ అధికారులు శుక్రవారం జిల్లా ,మండల స్థాయి విద్యాశాఖ అధికారులతో జూమ్ మీటింగ్ నిర్వహించారు. విశ్వసనీయ వర్గాల కథనం ప్రకారం సమావేశంలో ముఖ్యాంశాలు ఇలా ఉన్నాయి...స్కూల్ రీ స్ట్రక్చర్ జీవో ఒకటి రెండు రోజుల్లో వెలువడనుంది. సీనియారిటీ జాబితాలు నూరు శాతం పూర్తి చేశారు. ట్రాన్స్‌ఫర్ల ప్రక్రియ మొత్తం ఆన్లైన్ ద్వారా నిర్వహిస్తారు.ప్రమోషన్ల కోసం 1:2 ప్రాతిపదికన సెలక్షన్ లిస్ట్ విడుదల చేసి ఉపాధ్యాయుల విల్లింగ్ తీసుకుంటారు. పోస్టులు బ్లాక్ చేయడం జరగదు. ట్రాన్ఫర్లు,ప్రమోషన్లలో ఏదైనా పాఠశాలలో 50 శాతం కంటే ఎక్కువ మంది ఉపాధ్యాయులు రిలీవ్ అవ్వాల్సి వస్తే నూతన డీఎస్సీ 2025 ఉపాధ్యాయులు వచ్చేదాకా 50 శాతం పైబడి ఉపాధ్యాయులు వేచి ఉండవలసి వస్తుంది. జూన్ 5 నుంచి 11 వరకు ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు ఉంటాయి. జూన్ 12 నుంచి 20 వరకు ఎన్రోల్మెంట్ డ్రైవ్ ఉంటుంది. ఎన్రోల్మెంట్ డ్రైవ్ లో ముఖ్యంగా మోడల్ ప్రైమరీ స్కూలు, అప్ గ్రేడెడ్ హై స్కూల్ టార్గెట్ ఎన్రోల్మెంట్ కచ్చితంగా సాధించాలి. జూన్ 28న మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశం ఉంటుంది. ట్రాన్స్‌ఫర్ల ప్రక్రియ పూర్తి అయిన తర్వాత ప్రోగ్రెస్ కార్డులు తదుపరి క్లాస్ టీచర్‌కి అప్పగించాల్సి ఉంటుంది. ఎస్ఏ 2 మార్కులు ఆన్లైన్ వర్క్ ప్రతి పాఠశాలలో 100 శాతం పూర్తి చేయాలి. లీప్ యాప్ ఆండ్రాయిడ్ ఎనిమిది వెర్షన్ మాత్రమే పనిచేస్తుంది. దీనిని అప్డేట్ చేయడం జరుగుతుంది.

దళారుల ప్రమేయం లేకుండా ధాన్యం కొనుగోలు

విశాలాంధ్ర- ఏలూరు: రైతులు పండించిన ధాన్యాన్ని దళారుల ప్రమేయం లేకుండా రైతు సేవాకేంద్రాల ద్వారా సంబంధిత సిబ్బంది ట్రాక్‌షీట్‌లో నమోదు చేసి రైస్ మిల్లులకు తరలిస్తున్నారని జిల్లా పౌర సరఫరాల మేనేజరు పి.ఎస్.ఆర్. మూర్తి తెలిపారు. జిల్లాలో ఉన్న రైతులు వారి సమీపంలోని రైతు సేవాకేంద్రాల ద్వారా వారు పండించిన ధాన్యాన్ని అమ్ముకోవడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం వారు నిర్ణయించిన ఈ పంటలో నమోదైన రైతుల ధాన్యాన్ని విక్రయించడానికి వీలుపడుతుందన్నారు. జిల్లాలో ఉన్న అన్ని రైతు సేవాకేంద్రాల ద్వారా ఇంతవరకు 57,50,574 గోనె సంచులను రైతులకు సరఫరా చేసి రూ. 501.81 కోట్ల విలువైన 2.30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 17,512 మంది రైతుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేసినట్టు తెలిపారు. ఇందుకు సంబంధించి ఇంతవరకు రూ.398.52 కోట్లు రైతుల ఖాతాలకు జమచేయనున్నామన్నారు. రైతు సంఘాలు, రైతుల విజ్ఞప్తుల మేరకు జిల్లాకు 2.70 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా నిర్ణయించినట్టు తెలిపారు. రైతుల వద్దవున్న ధాన్యాన్ని సమీపంలోఉన్న రైతు సేవాకేంద్రాల ద్వారా అమ్ముకోవల్సిందిగా ఆయన కోరారు. అకాల వర్షాల వలన రైతులు ఎవ్వరూ అధైర్యపడవద్దన్నారు. రైతుల ధాన్యాన్ని ప్రభుత్వం వారు నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలు అనుసరించి కొనుగోలు చేయనున్నట్టు తెలిపారు.

నేటి నుంచి జగన్నాథ స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు

విశాలాంధ్ర - ముదినేపల్లి : ముదినేపల్లి మండలం వడాలి గ్రామంలో వేంచేసియున్న శ్రీ సుభద్ర బలరామ సహిత శ్రీ జగన్నాథస్వామివారి వార్షిక బ్రహ్మోత్స వాలు ఈనెల 10 నుండి 14 వరకు నిర్వహించనున్నట్లు ఆలయ ఇవో సింగనపల్లి శ్రీనివాసరావు తెలిపారు.

వైభవంగా సాగే ఈ బ్రహ్మోత్సవాలకు 10న స్వామి వారిని పెండ్లి కుమారుని చేయుట , 11న కళ్యాణ మహోత్సవం ,12న రథోత్సవం, 15న అఖండ అన్నసమారాధనతో ఉత్సవాలు ముగుస్తాయని పలు ప్రాంతాల నుండి తరలివచ్చే భక్తులకు విస్తృత ఏర్పాట్లు చేసినట్లు ఈవో వివరించారు.

ప్రణాళికతో గృహ నిర్మాణ లక్ష్యాలు సాధించాలి

గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారధి

విశాలాంధ్ర -నూజివీడు : ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యం మేరకు గృహ నిర్మాణం పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో చర్యలు తీసుకోవడానికి వెనుకాడబోమని రాష్ట్ర గృహనిర్మాణ మరియు సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి స్పష్టం చేశారు.శుక్రవారం నూజివీడు సబ్ కలెక్టర్ సమావేశ మందిరంలో గృహనిర్మాణ పనులు ప్రగతి పై హౌసింగ్,విద్యుత్ , పంచాయతీ రాజ్, ఆర్అండ్‌బి, మండల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. నియోజక వర్గంలోని నాలుగు మండలాలతో పాటు పట్టణంలో నిర్మించే గృహ నిర్మాణాల ప్రగతి పనులపై ఒక్కొక్కటిగా అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో తెలుగు దేశం పార్టీ నాయకులు గృహనిర్మాణం పై కొన్ని సమస్యలు మంత్రి దృష్టికి తీసుకుని రాగా తక్షణమే పరిష్కారమార్గం చూడాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారధి మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి పేదవారికి ఇల్లు ఉండాలనేదే ప్రభుత్వ లక్ష్యం అన్నారు. ప్రణాళికబద్ధంగా నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు నిబద్ధతతో పనిచేయాలన్నారు. నియోజకవర్గంలో గతంలో తాము ఇచ్చిన ఇళ్ల నిర్మాణ స్కీం టార్గెట్ ఎందుకు పూర్తి చేయలేక పోయారని అధికారులను నిలదీశారు. నిర్దేశించిన సమయానికి ఇళ్ల నిర్మాణ పనులు పూర్తి చేయకపోతే తగిన చర్యలు తప్పవని అధికారులను హెచ్చరించారు. జిల్లా గృహనిర్మాణ ప్రాజెక్ట్ డైరెక్టర్, అసిస్టెంట్ ఇంజినీర్లు, వర్క్ ఇన్స్పెక్టర్లు, అందరూ కలిసి సమన్వయంతో పని చేయాలని సూచించారు. సమన్వయంతో అందరూ కలసి పనిచేసి మీకు ఇచ్చిన టార్గెట్లు నిర్ణీత సమయానికి పూర్తి చేయాలని గృహనిర్మాణ అధికారులను ఆదేశించారు.

వచ్చే జూన్ నెలాఖరుకు నియోజకవర్గంలో గృహనిర్మా ణాలు పూర్తి చేయాలన్నారు.ఈ సమా వేశంలో నూజివీడు సబ్ కలెక్టర్ బి.స్మరణ్ రాజ్,గృహనిర్మాణ ప్రాజెక్టు డైరెక్టర్, అసిస్టెంట్ ఇంజినీర్లు, తహశీల్దార్లు, మున్సిపల్ చైర్మన్, ఇతర ప్రభుత్వ అధికారులు, వర్క్ ఇన్స్పెక్టర్లు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యావ్యవస్థను బలోపేతం చేయండి

ఎంఈఓ-2ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు టీవీ రామకృష్ణ

విశాలాంధ్ర-ఏలూరు : ఎంఈఓ-1,ఎంఈఓ-2 ల పదవీ విరమణ తో ఖాళీలు ఏర్పడ్డ పోస్టులలో గ్రేట్ 2 హెచ్ఎం లకు ఎంఈఓ లుగా పదోన్నతి కల్పించాలని ఎంఈఓ 2ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు టీవీ రామకృష్ణ ప్రభుత్వాన్ని కోరారు. మండల విద్యాశాఖ వ్యవస్థలో కీలకమైన మండల విద్యాధికారి పోస్టు ఒకటిగా ఉన్న క్రమంలో చాలా పని ఒత్తిడి, వివిధ రకాల పథకాలు పర్యవేక్షణ,విద్యార్థులు అకడమిక్ పర్యవేక్షణ, పటిష్టత కొరకు వివిధ పోస్టులను కలిపి మండల విద్యాశాఖ అధికారి-2 పోస్టులను గత ప్రభుత్వం తీసుకువచ్చిందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో అనేక మండలాల్లో మండల విద్యాశాఖ అధికారులు పదవీ విరమణ చేయడం వలన ఒకటి మరియు రెండు స్థానాల్లో ఇన్‌చార్జిల పాలన ఉందన్నారు. సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర పంపిణీలు, పాఠ్యపుస్తకాలు పంపిణీలు, కొత్త పాఠశాలలు విద్యార్థుల చేరిక, వివిధ పాఠశాలల నూతన పునర్వ్యవస్థీకరణ, పాఠశాలల కూర్పు కలిగిన ఈ దశలో కీలకమైన మండల విద్యా అధికారి పోస్టులను భర్తీ చేయకపోవడం లేదా,ఏ విధంగా భర్తీ చేస్తారో అనే విషయాన్ని ప్రస్తావించక పోవడం విడ్డూరం అని అన్నారు.ప్రస్తుతం రాబోతున్న విద్యాశాఖ మార్పుల్లో ఎక్కడా

కూడా వీటిని తిరిగి భర్తీ చేసే పరిస్థితి కనిపించడం లేదని తీవ్ర అసహనం వ్యక్త పరిచారు. ముందుగా మండల విద్యాశాఖ అధికారి పోస్టులను ప్రధానోపాధ్యాయులకు ప్రమోషన్ ఇచ్చి పూరించాల్సి ఉంది కానీ వచ్చేవారం నుండి జరిగే ప్రధానోపాధ్యాయుల బదిలీలు క్రమంలో వీటి ఊసు ఎక్కడా కానరావడంలేదన్నారు.. మండల విద్యావ్యవస్థకు కీలకమైన మండల విద్యాశాఖ అధికారి పోస్టులు నియామకం, బదిలీలపై ఉదాశీనత దేనికి తార్కాణం అన్నారు. పాఠశాలల పర్యవేక్షణ గాలికి వదిలేసిన పరిస్థితి నెలకొన్నందున తక్షణమే గ్రేడ్ 2 హెచ్ఎం లకు ఎంఈఓ లుగా పదోన్నతి కల్పించి విద్యావ్యవస్థను బలోపేతం చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

అమరవీరుడు మురళి నాయక్

విశాలాంధ్ర-ఏలూరు: దేశ రక్షణ కోసం ప్రాణాలర్పించిన అమరవీరుడు మురళి నాయక్ అని సిపిఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య,రాష్ట్ర సమితి సభ్యులు బండి వెంకటేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు.భారత నియంత్రణ రేఖ వద్ద పాక్ సైన్యం భారత పోస్టులపై కాల్పులతో విరుచుకుపడిన నేపథ్యంలో వారితో వీరోచితంగా పోరాడి మురళి నాయక్ తీవ్ర బుల్లెట్ గాయాలతో యుద్ధరంగంలోనే వీరమరణం పొందారని తెలిపారు.రాష్ట్రానికి చెందిన సత్యసాయి జిల్లా గోరంట్ల మండలానికి చెందిన మురళి నాయక్ యుద్ధభూమిలో నే ప్రాణాలు కోల్పోవడం బాధాకరం అన్నారు. దేశం కోసం ప్రాణాల ర్పించిన వీర జవాన్ మురళికి ఘనంగా నివాళులర్పించారు.మురళి నాయక్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఫీల్డ్ టెక్నీషియన్-ఎయిర్ కండిషనర్ కోర్సులో యువతకు ఉచిత శిక్షణ

విశాలాంధ్ర-ఏలూరు: జిల్లాలోని నిరుద్యోగ యువతకు షార్ట్ టర్మ్ కోర్స్ కింద "ఫీల్డ్ టెక్నీషియన్-ఎయిర్ కండిషనర్" కోర్సు లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు స్థానిక డి.యల్.టీ.సి సహాయ సంచాలకులు ఎస్.ఉగాది రవి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానమంత్రి కౌశల్ వికాశ్ యోజన క్రింద "ఫీల్డ్ టెక్నీషియన్-ఎయిర్ కండిషనర్" కోర్సు లో మూడు నెలల పాటు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. పదో తరగతి ఆ పైన ఉత్తీర్ణులైన వారు 18 నుంచి 35 ఏళ్ల లోపు వారు అర్హులని తెలిపారు.ఆసక్తి కలిగిన అభ్యర్థులు తమ దరఖాస్తులను మే,15వ తేదీలోగా ఏలూరు జిల్లా కలెక్టరేట్ సమీపంలోని డి. యల్.టీ. సి. కార్యాలయానికి పంపాలని, వివరాలకు: 9493482414. నెంబర్లను సంప్రదించగలరని ఉగాది రవి తెలియజేసారు.

ఓపిక, సహనం, ఓదార్పుకు ప్రతీక నర్సింగ్ వృత్తి

విశాలాంధ్ర-తాడేపల్లిగూడెం: నర్సింగ్ సేవల మాతృమూర్తి ఫ్లోరెన్స్ నైటింగేల్ జయంతిని పురస్కరించుకొని స్థానిక గాంధీ బొమ్మ సెంటర్ లోని "జ్యోతి ఎడ్యుకేషనల్ సొసైటీ"యాజమాన్యం దత్తు వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో

ముఖ్యఅతిథిగా పాల్గొన్న జనసేన యువ నాయకుడు బొలిశెట్టి రాజేష్ ఫ్లోరెన్స్ నైటింగేల్ విగ్రహానికి పూలమాలలు వేసి కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి నర్సులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రి స్టాఫ్ నర్సులకు శాలువాలు కప్పి సన్మానం చేసి, జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా బొలిశెట్టి రాజేష్ మాట్లాడుతూ ఓపిక, సహనం,ఓదార్పుకు ప్రతీక నర్సింగ్ వృత్తి అన్నారు. రోగులపట్ల అంకిత భావం, సేవాతపనతో నర్సులు పని చేస్తారని, రోగుల ప్రాణాలను కాపాడటంలో వారే కీలకంగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. అనంతరం బొలిశెట్టి రాజేష్ గజమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో దత్తు భరత్, దత్తు లక్ష్మణ్, సువర్ణ, ఆశ, బీసీ నాయకులు నీలపాల దినేష్ యాదవ్, పిడుగు రామ్మోహన్ బ్రదర్స్ నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఆలయాల నిర్మాణానికి దాతలు ముందుకు రావాలి

విశాలాంధ్ర - గణపవరం: గ్రామీణ ప్రాంతాల్లో దేవాలయాల నిర్మాణానికి దాతలు ముందుకు రావాలని తెలుగుదేశం పార్టీ ఏలూరు జిల్లా అధ్యక్షులు, ఉంగుటూరు మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు అన్నారు. శుక్రవారం గణపవరం మండలం వల్లూరు గ్రామంలో శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో విగ్రహప్రతిష్ఠ అతి వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో వల్లూరు గ్రామ సర్పంచ్ ముచ్చర్ల వేణు గోపాలకృష్ణ, క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ ఇందుకూరి రామకృష్ణం రాజు, కొప్పులవెలమ కార్పొరేషన్ డైరెక్టర్ చింతల శ్రీనివాసు, నందూరి పెదకాపు, మండల టీడీపి అధికార ప్రతినిధి కూనసాని నాగేశ్వరరావు, ఇతర తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు సభ్యులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు చేయండి

విశాలాంధ్ర - సీతానగరం: రైతుల వద్ద ఉన్న ధాన్యం కొనుగోలకు వెంటనే ఏర్పాట్లు చేయాలని రాజానగరం నియోజకవర్గ ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు. శుక్రవారం కోరుకొండ ఎంపీడీవో కార్యాలయంలో ఎమ్మెల్యే బలరామకృష్ణ మూడు మండలాల వ్యవసాయ శాఖ అధికారులతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజానగరం నియోజకవర్గంలో రైతులు వద్ద ఇంకా మిగులు ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయడానికి ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రాజానగరం నియోజక వర్గంలోని వరి పండించిన రైతులు వద్ద మిగులు ధాన్యం వివరాలు సేకరించి వెంటనే కొనుగోలుకు ఏర్పాటు చేయాలన్నారు. రైతుల వద్ద ఉన్న చివరి ధాన్యం గింజ వరకు కొనుగోలు చేయడానికి ఎంత టార్గెట్ అవసరం అవుతుందో అధికారులను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా నియోజక వర్గంలోని రైతులు వారికి ఉపయోగపడే వ్యవసాయ పరికరాల పంపిణీ కార్యక్రమం గురించి చర్చించారు. ఈ కార్యక్ర మంలో ఏ డి మల్లి కార్జునరావు, ఎంపిడిఓ అశోక్ కుమార్, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

వైద్య, ఆరోగ్య శాఖ మాక్ డ్రిల్

విశాలాంధ్ర - కడియం : ప్రస్తుతం నెలకొని ఉన్న యుద్ధ వాతావరణం దృష్ట్యా, పరిస్థితులు ఎలాంటివైనా ఎదుర్కోవడానికి సన్నద్ధం కావాలని కడియం గవర్నమెంట్ హాస్పిటల్ సూపరిం టెండెంట్ డాక్టర్ జి మాధురి అన్నారు. అదేవిధంగా తీసుకోవలసిన జాగ్రత్తల నిమిత్తం కడియం మండలంలో గల వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బందికి మాక్ డ్రిల్ నిర్వహించారు. ప్రస్తుత యుద్ధ వాతావరణంలో ఆరోగ్య రీత్యా ఎలాంటి పరిస్థితులు వచ్చినా వైద్య సిబ్బంది అందుబాటు లోను, అప్రమత్తంగాను ఉండాలన్నారు. అత్యవసర ప్రాథమిక వైద్య సేవలు అందించాలని, అనంతరం సమీప సామాజిక ఆసుపత్రికి తరలిం చాలని సూచించారు. కోవిడ్ సమయంలో ఎలా అయితే సేవలు అందించారో అలాగే సేవలు అందించడానికి సన్నద్ధులై ఉండాలని, అవసరమైన మందులు, పరికరాలు సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు. అదేవిధంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన గుండెకు భరోసా (స్టెమి) అవగాహన కార్యక్ర మంలో భాగంగా గుండెపోటు లక్షణాలు తెలియజేసి తీసుకోవలసిన జాగ్రత్తలు, క్షేత్ర స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించా లన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ ఎం మణిజ్యోత్స్న, డాక్టర్ ఎల్ మోహన వంశీ, డాక్టర్ ఎన్ నాగసాయి మౌర్య, విల్సన్ పాల్, మురళి, రవికుమార్, మూర్తి, సామాజిక ఆసుపత్రి సిబ్బంది, కడియం, కడియపులంక ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని హెల్త్ అసిస్టెంట్‌లు, ఎఎన్ఎంలు పాల్గొన్నారు.

నియోజవర్గ అభివృద్ధికి కృషి చేయాలి : ఎమ్మెల్యే

విశాలాంధ్ర-దేవరపల్లి : దేవరపల్లి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ కేవీకే దుర్గారావు అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గోపాలపురం ఎమ్మెల్ మద్దిపాటి వెంకటరాజు పాల్గొని మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసే నియోజవర్గాన్ని అభివృద్ధి పదంలో నడిపించాలని ఆయన అధికారులకు సూచించారు. ప్రతి ఒక్కరూ సమాజ అభివృద్ధి కోసం కలిసికట్టుగా పనిచేసి, అభివృద్ధి పథంలో నడిపించేలాగా కృషి చేయాలన్నారు గ్రామాల్లో జంగిల్ గేరెన్స్ చెత్తాచెదారాలను లేకుండా చూడవలసిన బాధ్యత విఆర్వోలు గ్రామ కార్యదర్శులు సచివాలయ సిబ్బంది పరిపాలన పారదర్శక తీసుకురావడానికి సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్ వేణుగోపాల్ రెడ్డి మండల పరిషత్ ఉపాధ్యక్షుడు సాది సుబ్బారావు వివిధ శాఖల అధికారులు తమ శాఖల అభివృద్ధిని వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్లు ఎంపీటీసీలు వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.

వల్లి బాష కుటుంబాన్ని ఎంఐఎం ప్రతినిధి బృందం పరామర్శ

విశాలాంధ్ర - నిడదవోలు : తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు చింత చెట్టు వీధిలో హత్యకు గురైన వంట మేస్త్రి వల్లి బాష కుటుంబాన్ని హైదరాబాదు నుండి వచ్చిన ఎంఐఎం ప్రతినిధి బృందం శుక్రవారం పరామర్శించారు. వల్లి భాష కుటుంబ సభ్యులకు భరోసా కల్పించి, నింది తుడిని కఠినంగా శిక్షించాలని,వల్లి బాష కుటుంబానికి ఉపాధి నిమిత్తం ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ముస్లిం సోదరులు జుమ్మా నమాజ్ అనంతరం ర్యాలీగా వెళ్లి నిందితుడ్ని కఠినంగా శిక్షించాలని, భాషా కుటుంబానికి రక్షణ కల్పించాలని, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని కోరుతూ స్థానిక ఎమ్మార్వోకు, నిడదవోలు సర్కిల్ సీఐ కు వినతి పత్రం అందించారు.ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో ముస్లిం సోదరులు, సానుభూతి పరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వర్షం నీటితో ఇక్కట్లు

విశాలాంధ్ర -పెరవలి : శుక్రవారం మధ్యాహ్నం కురిసిన వర్షానికి మండలంలో పలు ప్రాంతాలలో రోడ్లపై వర్షం నీరు నిలిచిపోయింది. ఖండవల్లి పంచాయతీ పరిధిలో లంకమాలపల్లి ప్రాంతంలో అనేక చోట్ల కొద్దిపాటి వర్షం కురిసినా ఆనీరు బయటకు వెళ్లే మార్గం సక్రమంగా లేకపోవడం వలన రాకపోకలు సాగించడానికి స్థానికులు ఇబ్బంది పాడాల్సిన పరిస్థితి ఎదురయ్యింది. అంతే కాకుండా ఆప్రాంతంలో నివసించేవారు తరచూ ఈవిధంగా జరగడం వలన ఎటువంటి అనారోగ్యాలు సంభవిస్తాయో అని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు అక్కడి పరిస్థితిని గమనించి వర్షం నీరు బయటకు వెళ్లే మార్గం చూడాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రమాదాల నివారణకు స్పీడ్ బ్రేకర్

విశాలాంధ్ర- తాళ్లపూడి : తాళ్లపూడి మండలం ప్రక్కిలంకలో మూడు రోడ్ల కూడలిలో ఏటీగట్టు రోడ్ మీద పడిపోయిన ఇసుక వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని, వాటిని నివారించడానికి, ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లకుండా అధికారులు స్పీడ్ బ్రేకర్ వేయించారు. గతంలో ఈ రహదారితో పరిచయం ఉన్న కొంత మంది కొత్తగా వేసిన స్పీడ్ బ్రేకర్ గమనించక పోవటం ఇబ్బందులు ఏదొర్కొంటున్నారు. చీకట్లో చూసుకోకపోవటం ఓ బైక్ ప్రమాదానికి గురైంది. ప్రమాధాలు జరగకుండా చేపెట్టిన చర్య ప్రమాదం వాటిల్లింది. హెచ్చరిక బోర్డ్ ఉంటే వాహనదారులకు సౌలభ్యంగా ఉంటుందన్న అభిప్రాయం వ్యక్త మవుతోంది.

గ్యాస్ డెలివరీ బాయ్‌లకు హెచ్చరిక

విశాలాంధ్ర వార్తకు స్పందించిన అధికారులు

విశాలాంధ్ర-కొవ్వూరు : కొవ్వూరు పట్టణంలో ఇంటింటికి గ్యాస్ బండల డెలివరీ చేసే బాయిలు గ్యాస్ రేట్ కాకుండా అదనంగా డబ్బులు వసూలు చేస్తున్నారు. ఈ విషయమై విశాలాంధ్ర పత్రికలో వచ్చిన వార్తకు కొవ్వూరు సిఎస్డిటి సునీత స్పందించారు. దీంతో ఆమె సంబంధిత గ్యాస్ కంపెనీ డెలివరీ బాయ్‌ని పిలిపించి ఇకపై అదనపు వస్తువులు చేస్తే తీవ్ర చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో ఇందిరమ్మ కాలనీలో ఉంటున్న ఒక గృహనివద్దకు వెళ్లి అదనంగా వసూలు చేసిన డబ్బులు ఇచ్చేస్తామని బ్రతిమిలాడారు. కానీ ఆ గృహాన్ని ఇకపై ఎవరు వద్ద అదనపు వసూలు చేయవద్దని హెచ్చరించి వారిని పంపివేశారు.

సమ్మర్ క్యాంప్ ప్రారంభం

విశాలాంధ్ర-దేవరపల్లి: దేవరపల్లి భాష్యం స్కూల్ ప్రాంగణంలో దేవరపల్లి బలోత్సవం, చిల్డ్రన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సమ్మర్ క్యాంపును బలోత్సవం కమిటీ ప్రతినిధి ఉండవల్లి కృష్ణారావు ఘనంగా ప్రారంభించారు. మే 9 నుంచి మే 20 వరకు భాష్యం స్కూల్ ప్రాంగణంలో ఉదయం తొమ్మిదిగంటల నుంచి పన్నెండు గంటల వరకు సమ్మర్ క్యాంపును ఉచితంగా నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ క్యాంపులో యోగా, ధ్యానం, చిత్రలేఖనం, పద్యాలు, కథలు చెప్పడం అందమైన దస్తూరి, పజల్స్,ఇండోర్ గేమ్స్ నందు శిక్షణ అందిస్తున్నామని ,విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. భాష్యం స్కూల్ ప్రిన్సిపాల్ పి.పేరయ్య నాయుడు మాట్లాడుతూ విద్యార్థులలో దాగిన సృజనాత్మకతను వెలికితీయడానికి, మొబైల్,టెలివిజన్ వంటివి వ్యసనంగా మారకుండా సద్వినియోగం చేసుకోవడానికి సమ్మర్ క్యాంపు ఉపయోగపడుయన్నారు. భాష్యం ఛాంప్స్ ప్రిన్సిపాల్ షేక్ షబాన,శిక్షకులు మంజు,సృతి,రాణి, శివ,భారతి,ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

విశాలాంధ్ర - జగ్గంపేట : అనారోగ్యం బారిన పడి వైద్యం చేయించుకోలేని 17 మందికి సీఎం సహాయనిధి చెక్కులను టిడిపి కాకినాడ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ శుక్రవారం అందజేశారు. నియోజకవర్గంలోని 17 మంది సహాయం కోసం స్థానిక ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ద్వారా అర్థించగా వారికి రూ.19 లక్షల 53 వేల 646 చెక్కులు విడుదలయ్యాయి. వాటిని నియోజవర్గ టీడీపీ కార్యాలయంలో వారికి నవీన్ అందించారు. ఈ కార్యక్రమంలో జగ్గంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ అడపా భారత్ కుమార్, తాళ్ళూరు సర్పంచ్ శిలామంతుల వీరబాబు, టిడిపి నాయకులు మారిశెట్టి భద్రం, జీను మణిబాబు, రేఖ బుల్లి రాజు, అల్లు విజయకుమార్, పోట్రూ కృష్ణ, జ్యోతుల సత్యమూర్తి, చిట్యాల బాబ్జి, కందుల జమ్మి, తంగెళ్ల అప్పారావు, వల్లెపు అన్నవరం, అప్పన వీరబాబు, పోట్రూ రాముడు పాల్గొన్నారు.

రాజకీయ లబ్దికోసం పక్కదారి పట్టించే ప్రయత్నం : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - అనపర్తి/పెదపూడి : దోమాడ ఘటన తనకు అనుకూలంగా మార్చుకొని రాజకీయ లబ్ధి పొందాలని మాజీ ప్రజా ప్రతినిధి ప్రయత్నించారని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆరోపించారు. శుక్రవారం దోమాడలో ఇళ్లు కోల్పో యిన ఎనిమిది బాధిత కుటుంబాలకు మూడేసి సెంట్లు చొప్పున ఎమ్మెల్యే నల్లమిల్లి పట్టాలు పంపిణీ చేశారు. ఇళ్ళు నిర్మించుకునేందుకు ఐదు కుటుం బాలకు రూ.3 లక్షల హౌసింగ్‌లోన్ చెక్కులు, కాకినాడ ఇండియన్ రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో నిత్యావసర వస్తువులు బాధితులకు అందించడం జరిగింది. ఎమ్మెల్యే నల్లమిల్లి మాట్లాడుతూ బాధితుల తరపున పనిచేసిన ఉద్యమ సంఘాల కృషిని తమ ఖాతాలో వేసుకోవాలని మాజీ ప్రజా ప్రతినిధి ప్రయత్నించారని విమర్శించారు. ఆల స్యంగా తమకు అన్యాయం జరుగుతున్న విషయాన్ని గ్రహించి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి వద్దకు వెళితే ఎటువంటి అహం లేకుండా తమకు న్యాయం చేశారని బాధితులు, ఉద్యమకారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ కె నరేంద్ర రెడ్డి, తహసీల్దారు, డిప్యూటీ ఎంపీడీవో ఎమ్ఎస్ఎన్ రెడ్డి, ఎన్‌డిఏ నేతలు, అధికారులు పాల్గొన్నారు.

సివిల్ డిఫెన్స్ మాక్ డ్రిల్

విశాలాంధ్ర - రాజోలు : భారత్-పాక్ దేశాల యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ వారి సూచనల మేరకు తాటిపాక గేయిల్ ఆధ్వర్యంలో తాటిపాక గ్యాస్ రిసీవింగ్ టెర్మినల్ నందు శుక్రవారం సివిల్ డిఫెన్స్ మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీజీఎం ఎస్వీ మూర్తి మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవలసిన జాగ్రత్తలు మరియు విధులను వివరించారు. ఈ కార్యక్రమంలో గెయిల్ సెక్యూరిటీ సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యే వినతులు స్వీకరణ

విశాలాంధ్ర - రావులపాలెం : ప్రభుత్వం చేపట్టిన ప్రతిష్టాత్మక కార్యక్రమం ప్రజాదర్బార్‌ను రావులపాలెం క్యాంపు కార్యాలయం వద్ద కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు నిర్వహించారు. నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజల వద్ద నుండి అర్జీలను ఎమ్మెల్యే స్వీకరించారు. నేటి ప్రజాదర్బార్ కార్యక్రమంలో 230 అర్జీలు ప్రజల వద్ద నుండి స్వీకరించడం జరిగిందని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజా వినతులు, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకునే విధంగా సంబంధిత శాఖల అధికారులకు అర్జీలను అందజేస్తున్నట్లు చెప్పారు. రావులపాలెంకు చెందిన ఒక మహిళ సమస్యను ఎమ్మెల్యే సత్యానందరావుకు విన్నవించుకోగా హుటాహుటిన పంచాయితీ కార్యదర్శిని పిలిపించి తక్షణమే సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజాదర్బార్‌లో ప్రజలు ఇచ్చిన అర్జీలకు పరిష్కారం చూపుతామని ఎమ్మెల్యే సత్యానందరావు తెలిపారు.

అనుమతులున్న చోట ఇసుక తొలకాలు

విశాలాంధ్ర - సీతానగరం: అనుమతులు ఉన్న చోట మాత్రమే ఇసుక తొలకాలు జరపాలని వీఆర్వో బాబురావు అన్నారు. మండలంలో వంగలపూడి గ్రామ పంచాయతీ పరిధిలో రెండు ఇసుక ర్యాంపులు గత కొద్ది కాలంగా నిర్వహిస్తున్న సంగతి అందరికీ తెలిసిందే. అయితే శుక్రవారం ఉదయం ట్రాక్టర్లు ద్వారా డంపింగ్ చేయడానికి ఇసుకను తోలుతున్న ట్రాక్టర్లను విఆర్ఓ నిలిపివేశారు. ప్రభుత్వ అనుమతులు మంజూరు చేసిన ప్రాంతంలోనే ఇసుక తోలకాలు జరపాలని పలుమార్లు ర్యాంపు నిర్వాహకులకు చెప్పిన పట్టించుకోవడంలేదన్నారు. దీంతో ట్రాక్టర్లను నిలిపివేసి ప్రభుత్వ అనుమతులు ఉన్నచోట మాత్రమే ఇసుక తోలకాలు జరపాలని చెప్పడం జరిగిందన్నారు. అధికారులు నిర్ణయించిన జియో కోఆర్డినేట్స్ ప్రకారమే ఇసుక తొలకాలు జరపాలని లేనియెడల చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు.

మహిళల ఆర్థిక అభివృద్ధికి కుట్టు మిషన్లు దోహదం

విశాలాంధ్ర-దేవరపల్లి: దేవరపల్లి మండల పరిషత్ కార్యాలయంలో గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు కుట్టుమిషన్ల శిక్షణ ప్రారంభించారు. ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్ రాజు మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందటానికి కుట్టు మిషన్లు ఎంతో దోహదపడతాయన్నారు. ట్రైనీ లక్క లక్ష్మి మాట్లాడుతూ ఈ శిక్షణలో మొత్తం 144 మంది ఉంటారని వీరిని రెండు బ్యాచ్‌లుగా విభజించి శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కేవీకే, దుర్గారావు సర్పంచ్ కడిమి వీర కుమారి, ఎంపీడీవో ఎస్ వేణుగోపాల్ రెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు ఆండ్రు అనిల్, టీడీపీ నేతలు ఘనమని హరికృష్ణ , సుంకర దుర్గారావు, ఉప్పులూరి రాంబాబు, ఎంపీటీసీలు, గ్రామ సర్పంచులు, పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల బకాయిలు తక్షణమే చెల్లించాలి

విశాలాంధ్ర - కాకినాడ : మున్సిపల్ పారిశుద్ధ కార్మికుల సమస్యలు పరిష్కారం చేయాలని దేశవ్యాప్తంగా మే 20న జరిగే సార్వత్రిక సమ్మెలో మున్సిపల్ పాల్గొనేందుకు శుక్రవారం ఉదయం కాకినాడలో స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ పృధ్వి చరణ్‌కి ఏపీ మున్సిపల్ వర్కర్స్ AITUC అనుబంధ సంఘం కాకినాడ కమిటీ ఆధ్వర్యంలో సమ్మె నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షులు బొబ్బిలి శ్రీనివాసరావు మాట్లాడుతూ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులను (ఆప్కాస్ వర్కర్స్) పర్మినెంట్ చేయకుండా రిటైర్మెంట్ పేరుతో వారిని విధుల నుంచి తొలగించారని, కనీసం ముందస్తు సమాచారంగా ఏ విధమైన నోటీసులు ఇవ్వకుండా విధుల నుంచి తొలగిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 60 సంవత్సరాల వయోపరిమితి 62 సంవత్సరాలకు పెంచాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ వర్తింపజేసి వారి కుటుంబాలను ఆదుకోవాలని, వారసత్వ హక్కుగా కుటుంబీకులకి ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. కాకినాడ స్పెషల్ శానిటేషన్, టాయిలెట్ వర్కర్స్‌లకు సుమారు ఐదు నెలలుగా జీతాలు చెల్లించలేదని, కార్మికులకు జీతాలు సకాలంలో మంజూరు కాక తీవ్ర ఇబ్బందులకు గురవుతూ అప్పులు ఊబిలో కరుకుపోతున్నారని, ప్రభుత్వం వెంటనే వారికి బకాయి జీతాలు చెల్లించాలని, మే 20న జరిగే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెలో మున్సిపల్ కార్మికులు పనులు నిలుపుదల చేసి సమ్మెలో పాల్గొంటామని ఆయన అన్నారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి తుపాకుల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ కాకినాడ స్పెషల్ శానిటేషన్, టాయిలెట్ కార్మికులకు జీతాలు పెండింగ్లో లేకుండా ప్రతినెల 1 నుండి 5 లోపు చెల్లించాలని, బిల్లులు మంజూరు చేయడంలో అధికారులు అలసత్వం వహిస్తున్నారని, మున్సిపల్ పారిశుధ్య కార్మికులు దుర్భరమైన జీవితాలు గడుపుతూ విధులు నిర్వహిస్తున్నారని వారికి నెల జీతాలు పూర్తిస్థాయిలో బిల్లులు చేయకుండా కార్మికుల జీవితాలతో చెలగాటమడుతున్నారని, పెండింగ్ బిల్లులు మంజూరు కోసం ఆఫీసు కార్యాల చుట్టూ ప్రదర్శన చేస్తున్నారని, ఇప్పటికైనా అధికారులు చిత్తశుద్ధిగా పనులు నిర్వహించకపోతే వారిపై యూనియన్ ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బంగారు రాజేష్, సింగంపల్లి రమణ, జనపల్లి అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన : సీఐ

విశాలాంధ్ర - ఆలమూరు : ప్రతి ఒక్క వాహనదారుడు రోడ్డు నియమాలపై అవగాహన కలిగి ఉండాలని, ప్రమాదాల నివారణకు భద్రత నియమావళి తప్పనిసరిగా పాటించాలని రావులపాలెం రూరల్ సిఐ సిహెచ్ విద్యాసాగర్ పేర్కొన్నారు. మండలంలోని జొన్నాడ జాతీయ రహదారి, కాకినాడ వెళ్లే ఆర్ అండ్ బి రోడ్డుపై ఆలమూరు ఎస్సై ఎం అశోక్‌తో కలిసి వాహన తనిఖీలు నిర్వహించారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న ముగ్గురు ద్విచక్ర వాహనదారులను, ఒక ట్రాక్టర్ డ్రైవరు, మరొక లారీ డ్రైవర్లపై కేసులు నమోదు చేసినట్లు సీఐ విద్యాసాగర్ వెల్లడించారు. బస్సులో వెళ్లే ప్రయాణికులు బాణాసంచా, మద్యం బాటిల్స్ వంటివి తీసుకుని వెళ్లరాదని సూచించారు. వాహనాలకు సరైన పత్రాలు లేని వాహనదారులకు రూ.15 వేలు అపరాధ రుసుం విధించారు. అలాగే రోడ్డుపై వెళ్లే వాహనదారులకు రోడ్డు భద్రత నియమావళిపై అవగాహన కల్పించారు. రోడ్డు మధ్యలో వాహనాలను ఆపి ప్రయాణికులను ఎక్కించడం, దింపడం వంటివి చేయరాదని, ఎక్కువ ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో గంటలకొద్ది వాహనాలను ఆపరాదని, ఆటోలపై పరిమితికి మించి ప్రయాణికులను తరలించరాదని తెలిపారు. ఈ తనిఖీల్లో హైవే పోలీస్పె, ట్రోలింగ్ అధికారులు పాల్గొన్నారు.

బాధితులకు ఇళ్ల పట్టాలు పంపిణీ

విశాలాంధ్ర - పెదపూడి : మండలంలో దోమాడ గ్రామంలో ఇల్లు కోల్పోయిన బాధితులకు అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఇళ్ల పట్టాలను అందజేసారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాల యంలో జరిగిన కార్యక్రమంలో పట్టాలతోపాటు ఐదుగురు లబ్దిదారులకు మూడేసి లక్ష రూపాయల చెక్కులను రెడ్ క్రాస్ కాకినాడ వారు అందజేసిన నిత్యావసర సరుకుల కిట్లను ఎమ్మెల్యే బాధితులు అందజేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, అధికారులు, స్థానికులు పాల్గొన్నారు. అలాగే స్థానిక ఎస్సీ పేటలో నూతనంగా ఏర్పాటు చేసిన బాబు జగజీవన్ రామ్ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం సమాధాన కార్యక్రమం నిర్వహించారు.

ప్రసాద్ బ్యూటిఫుల్ ఇంగ్లీష్ హ్యాండ్ రైటింగ్ ప్రాక్టీస్ పుస్తకావిష్కారణ

విశాలాంధ్ర - పిఠాపురం : పిఠాపురం శ్రీ విశ్వ విజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠంలో నిర్వహిస్తున్న తాత్విక బాల వికాస్ వేసవి శిక్షణ తరగతులలో జిల్లాలో సీసీఆర్టీ ప్రసాద్, కాలిగ్రఫీ ప్రసాద్‌గా పేరు గాంచిన కెవిఎస్ఎస్ ప్రసాద్‌చే స్వంతదస్తూరితో వ్రాయబడిన ప్రసాద్ బ్యూటిఫుల్ ఇంగ్లీష్ హ్యాండ్ రైటింగ్ ప్రాక్టీస్ పుస్తకాన్ని శ్రీ విశ్వవిజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠం, నవమ పీఠాధిపతి, సద్గురువర్యులు డాక్టర్ ఉమర్ ఆలీషా ఆవిష్కరించారు. ప్రసాద్ మాస్టారు చేస్తున్న సేవలు గురించి, ఇంగ్లీష్ హ్యాండ్ రైటింగ్‌లో గడించిన ఖ్యాతి గురించి సద్గురువర్యులు తెలియజేశారు. అదేవిధంగా తాత్విక బాలవికాస్‌లో చిన్నారులకు పలు అంశాలపై విజ్ఞానాన్ని కలిగిస్తూ, తన సేవలను అందిస్తున్నారని తెలియజేశారు. ప్రసాద్ మాస్టారు వద్ద హ్యాండ్ రైటింగ్ స్కిల్స్ నేర్చుకుని విద్యావంతులుగా అభివృద్ధి చెందాలని తెలియజేశారు. ప్రసాద్ మాస్టారు మాట్లాడుతూ 9 గీతలు ప్రాక్టీస్ చేస్తే అక్షరాలు ఏర్పడతాయని, తరువాత కలిపే విధానం తెలుసుకుంటే పదాలు ఏర్పడతాయని, పదాలు వాక్యాలుగా మారతాయని తెలియజేశారు. భారత దేశవ్యాప్తంగా తన హ్యాండ్ రైటింగ్ ఉందని ఆ అవకాశం సీసీఆర్టీ కల్పించిందని తెలియచేశారు. ఈ ప్రాక్టీస్ వల్ల బ్యూటిఫుల్ ఇంగ్లీష్ హ్యాండ్ రైటింగ్ రాయగలుగుతారని తెలియ జేశారు. పుస్తక ఆవిష్కరణ కార్యక్రమాన్ని తీసుకురావ డానికి ప్రయత్నిస్తున్నానని ప్రసాద్ మాస్టారు తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో ఏవివి సత్యనారాయణ, ఎస్టీవీ వర్మ, తటవర్తి సుబ్బారావు, ఎం సత్యనారాయణ, డాక్టర్ మల్లి, జనార్ధన్, మ్యాజిక్ రమణ మూర్తి, నాగేశ్వరావు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మెడ్ యునైటెడ్ హాస్పటల్ ఉచిత లివర్ పరీక్షలు

విశాలాంధ్ర - అమలాపురం : వాకర్స్ హెల్త్ క్లబ్ సభ్యుల ప్రోత్సాహంతో అమలాపురం మెడ్ యునైటెడ్ హాస్పటల్‌లో ఉచిత లివర్ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు రూ.5వేలు విలువచేసే పరీ క్షలు ఉచితంగా చేయడం జరిగింది. ఈ కార్యక్ర మంలో ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ కేపిఆర్ కిషోర్ ముఖ్య అతిథిగా పాల్గొని పరీక్షలు నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు బోనం సత్య వరప్రసాద్, సెక్రెటరీ బూరగాయల శివరామకృష్ణ, ఉపాధ్యక్షులు నూకల సత్యనారాయణ, డైరెక్టర్ మోకా వెంకటసుబ్బారావు, వలవల రెడ్డి నాయుడు, పుత్సా కామేశ్వరరావు, పట్నాల రమణ, యర్రమిల్లి సత్యనారా యణమూర్తి, కుడిపూడి త్రినాథ్, గోడేటి గంగాధర్, సప్పా నాగేశ్వరావు, అల్లాడ వెంకట రమణ, మహిళా వాకర్స్ హెల్త్ క్లబ్ అధ్యక్షురాలు వై అనంతలక్ష్మి, సెక్రెటరీ లక్ష్మి పుత్సా రాజేశ్వరి పాల్గొన్నారు.

ఆర్టీసీ 10వ బ్యాచ్ హెవీ డ్రైవింగ్ ట్రైనీలకు సర్టిఫికెట్ల అందజేత

విశాలాంధ్ర - అమలాపురం : స్థానిక అమలా పురం ఏపీఎస్ ఆర్టీసీ డిపోలో నిర్వహించుచున్న హెవీ డ్రైవింగ్ స్కూల్‌లో 10వ బ్యాచ్, 16 మంది అభ్యర్థులతో 32 రోజులు శిక్షణ పూర్తి చేసుకున్న సందర్భంగా శుక్రవారం అమలాపురం డిపోలో ఎస్‌టిపి రాఘవ కుమార్, జిల్లా ప్రజా రవాణాధికారి, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన అమలాపురం డిటిఓ డి శ్రీనివాసరావు చేతుల మీదుగా అభ్యర్దులకు సర్టిఫికెట్లు అందజేసి, ప్రతీ ఒక్కరూ భద్రతతో కూడిన డ్రైవింగ్ సామాజిక బాధ్యతగా భావించాలన్నారు. ఎస్‌టిపి రాఘవ కుమార్, డిపిటిఓ కేఎస్ఎన్ఎస్ఎమ్ మాట్లాడుతూ శిక్షణ నిమిత్తం ఆర్‌టీసి శిక్షణా కళాశాలను ఎంపిక చేసుకున్నందుకు అభినందనలు తెలియజేశారు. అమలాపురం డిపో మేనేజర్ సిహెచ్ఎస్ఎన్ మూర్తి ఆర్టీసీ శిక్షణ కళాశాల డ్రైవర్లకు ప్రాక్టికల్ శిక్షణతో పాటు మెయింటెనెన్స్ విషయమై అవగాహన కల్పించడం జరుగుతుంది అని త్వరలో జూన్ నెల రెండవ వారంలో 11వ బ్యాచ్ శిక్షణ తరగతి ప్రారంభమవుతున్నదని, ఆసక్తి గల అభ్యర్థులు ఎండి రజాక్, డ్రైవింగ్ ఇన్స్ట్రక్టర్, 7382909588ను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్ర మంలో జిఆర్ఎల్ దేవి అసిస్టెంట్ ఇంజనీర్ (మెకానికల్), ప్రతిమా కుమారి అసిస్టెంట్ మేనేజర్ (ట్రాఫిక్), రామారావు సెక్యూరిటీ యస్ఐ, వరహాలబాబు ఒపిఆర్‌యస్ సూపర్వైజర్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి ప్రణాళికలు : ఎమ్మెల్యే

విశాలాంధ్ర-దేవరపల్లి: గోపాలపురం నియోజక వర్గంలో గ్రామాల అభివృద్ధికి ప్రతి గ్రామానికి అభివృద్ధి ప్రణాళిక రూపొందిస్తున్నట్లు గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట రాజు పేర్కొన్నారు. దేవరపల్లి మండలం పల్లంట్లలో రాజమండ్రి పార్లమెంటు టీడీపీ ఉపాధ్యక్షుడు కొయ్యలమూడి చిన్నబాబు స్వగృహం వద్ద పల్లంట్ల గ్రామం అభివృద్ధి ప్రణాళికపై ఆయన గ్రామ తెలుగుదేశం పార్టీ నేతలు ప్రముఖులతో చర్చించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు మాట్లాడుతూ 15 అభివృద్ధి పనులకు ప్రణాళిక అభివృద్ధిలో పెట్టి పూర్తి చేస్తామన్నారు. ముఖ్యంగా పళ్ళంటల గ్రామానికి మంచినీటి బోరు మంజూరు చేశామని ఆయన వెల్లడించారు. పల్లంట్ల నుంచి ఎర్నగూడెం రోడ్డుకు కల్వర్టు నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని తెలిపారు. ఇదేవిధంగా ఎస్సీ ఎస్టీ బీసీ ఏరియాలో సీసీ రోడ్ల నిర్మాణం ఎస్సీ కళ్యాణ మండపానికి వివిధ అభివృద్ధి పనులకు గ్రామ ప్రజల నుంచి వినతి పత్రాలు అందాయని వాటిని పరిశీలించి నిధులు మంజూరు చేస్తామన్నారు. దేవరపల్లి లక్ష్మీపురం పల్లంట్ల కురుకూరు వరకు రోడ్డు నిర్మాణానికి కేంద్రమంత్రి నితిన్‌గడ్గరితో సంప్రదిస్తున్నామని ఈ విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సహకారంతో రూ.36 కోట్ల మంజూరుకు కృషి చేసి పనులు పూర్తి చేస్తామని ఎమ్మెల్యే మద్దిపాటి వెల్లడించారు. గోపాలపురం నియోజకవర్గానికి సీఎం చెక్కులు అందజేశామని ఈ విషయం గోపాలపురం నియోజకవర్గ చరిత్రలో గొప్ప విషయమన్నారు. ఈ సందర్భంగా పల్లంట్ల గ్రామానికి చెందిన మందపాటి సత్యనారాయణకు సీఎంఆర్ఎఫ్ రూ.33 వేలు చెక్కును అందజేశారు. గోపాలపురం నియోజకవర్గంలో 45 బోర్లు అప్లై చేయగా 12 బోర్లు మంజూరయ్యాయని ఒక్కొక్క బోరుకు రూ.35 లక్షలు ఖర్చు అవుతుందని తెలిపారు. రాబోవు స్థానిక సంస్థ ఎన్నికల్లో గోపాలపురం నియోజకవర్గంలో అన్ని గ్రామాలలో సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పిటిసిలు, పంచాయతీ వార్డు నెంబర్లు , ఎంపీపీ టీడీపీ అభ్యర్థులే గెలిపించడానికి నాయకులు కార్యకర్తలు కృషి చేసి తనకు బహుమానంగా అందజేయాలని కోరారు. శుక్రవారం మండలంలో జాజంపూడి కురుకూరు లక్ష్మీపురం దుమంతునిగూడెం కృష్ణపాలెం రామన్నపాలెం యాదవోలు చిన్నాయగూడెం సంగాయిగూడెం గ్రామాలలో గ్రామాల అభివృద్ధి ప్రణాళిక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవరపల్లి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ఆండ్రు అనిల్ రాజమండ్రి పార్లమెంటు ఉపాధ్యక్షుడు కోయిల మూడు చిన్నబాబు, మాజీ జడ్పిటిసి కొయ్యలమూడి సుధారాణి, ఏఎంసీ చైర్మన్ యద్దనపూడి బ్రహ్మ రాజు, పల్లట్ల టీడీపీ అధ్యక్షుడు ఆచంట శ్రీ రామ్ ప్రసాద్ మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్ నల్లమాటి నాగేశ్వరరావు గన్నమనే సత్య ప్రసాద్ చింతాల దాసు కొయ్యలమూడి సూర్యంద్రనాథ్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజును ఘనంగా సత్కరించారు

ఫుట్ బాల్ సమ్మర్ కోచింగ్ క్యాంప్ ప్రారంభం

విశాలాంధ్ర - రావులపాలెం : రావుల పాలెం ఎస్వీఎస్ జిల్లా ప్రజా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఫుట్‌బాల్ సమ్మర్ కోచింగ్ క్యాంప్‌ను రాష్ట్ర తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఆకులు రామకృష్ణ, జెడ్పిటిసి సభ్యులు కూడిపూడి శ్రీనివాస్, మాజీ డిసిఎంఎస్ చైర్మన్ కెవి సత్యనారాయణరెడ్డి కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో విద్య కమిటీ చైర్మన్ నందం వీర వెంకట సత్యనారాయణ, సీఆర్పీ గౌరవ అధ్యక్షులు గొలుగూరు వెంకటరెడ్డి విక్టరీ, స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు ఎం జానకి దేవి, చిలువూరి సతీష్ రాజు, మైగాపుల గురవయ్య నాయుడు, చిన్నం తేజ రెడ్డి, మద్దింశెట్టి శ్రీనివాసరావు, అంబటి కిషోర్, గ్రామం పెద్దలు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విరిగిపడిన చెట్లు

విశాలాంధ్ర- పెరవలి: శుక్రవారం వీచిన గాలికి మండలంలో అనేక ప్రాంతాలలో చెట్లు విరిగి నేలకొరిగాయి. నిడదవోలు నరసాపరం రహదారి తీపర్రు సమీపంలో చెట్లు విరిగి పడటంతో రాకపోకలు సాగించడానికి చాలా ఇబ్బందిపాడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఒకపక్క రైతులు వరి మాసూళ్లు చేసె క్రమంలో వాతావరణంలో వస్తున్న మార్పులకు రైతులు చేతికందిన పంట చేజారిపోతుందేమో అని ఆందోళన చెందుతున్నారు.

అతిథులకు వధూవరులు మొక్కలు పంపిణీ

విశాలాంధ్ర - కడియం : పెళ్లంటే ఇద్దరు వ్యక్తులు నూరేళ్లు కలిసి ఒకరికొకరు తోడుగా ఉండడమే కాదు, రెండు కుటుంబాలు కలిసి మెలిసి ఉండడం అని ఏదో సినిమాలో హీరో చెపుతాడు. ఈ మధ్యకాలంలో పెళ్ళిళ్ళు తమ అర్థబలం నిరూపించుకునేందుకు వేదికలుగా మారాయి. కళ్యాణ వేదికలకు లక్షల్లో అద్దెలు కడుతూ, లెక్కకు మించిన రకరకాల వంటలతో తమ హోదా ప్రదర్శిస్తున్నారు. దీనిలో భాగంగా ధనం వృధాగా ఖర్చు పెడుతూ, ఆహారాన్నీ వృధా చేస్తున్నారు. ఇందుకు భిన్నంగా ఒక యువకుడు పెళ్లి చేసుకుని పలువురికి ఆదర్శంగా నిలిచాడు. కడియం మండలం, కడియపులంక సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్‌లో గుమస్తాగా పని చేస్తున్న సత్యనారాయణ మూర్తి అనే యువకుడు, వృత్తిరీత్యా నర్సరీలో ఉండడం వలనో లేక పది మందికి ఆదర్శం కావాలనే ఉద్దేశంతోనో తన పెళ్లికి విచ్చేసిన అతిథులకు రకరకాల మొక్కలు పంచి పెట్టి, ఆదర్శంగా నిలిచాడు. ఏది ఏమైనా ఇలా కొత్తగా ఆలోచించి మొక్కలు పంచడం మంచి నిర్ణయమని, పలువురు గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.

సమస్యల పరిష్కారానికి ప్రజా దర్బార్ :ఎమ్మెల్యే

విశాలాంధ్ర - జగ్గంపేట : ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని జగ్గంపేట ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు సభ్యులు జ్యోతుల నెహ్రూ అన్నారు. స్థానిక నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ప్రజా దర్బార్ నిర్వహించి ప్రజల నుంచి వినతి పత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతి నియోజకవర్గంలో సమస్యల పరిష్కారం కోసం చక్కని వేదిక ఏర్పాటు చేశారన్నారు. ప్రజల నుండి వచ్చిన సమస్యలపై ఆయన అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలు పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త వెంకటేశ్వరరావు (కొండబాబు), ఆళ్ల రవి కిషోర్, మండపాక అప్పన్న దొర, పడాల బాలాజీ, పోలిన సత్యనారాయణ, అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రంలో షెడ్డు ప్రారంభం

విశాలాంధ్ర - ఆలమూరు : మండలంలోని పెదపళ్ల గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అవుట్ పేషంట్ విభాగం వద్ద వెయిటింగ్ షెడ్డును శుక్రవారం కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, జనసేన ఇంచార్జి బండారు శ్రీనివాస్ ప్రారంభించారు. ఓఎన్జీసి నిధుల నుంచి రూ.10 లక్షలు, మండల పరిషత్ నిధుల నుంచి రూ.2 లక్షలతో ఈ షెడ్డు నిర్మాణం చేపట్టినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ షెడ్డు నిర్మాణం వల్ల అవుట్ పేషంట్ వారికి ఇబ్బందులు తొలగనున్నాయని ఎమ్మెల్యే సత్యానందరావు పేర్కొన్నారు. అనంతరం పెద్దపల్ల గ్రామానికి ఓఎన్జిసి సహకారంతో సుమారు పది లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన చెత్తను తరలించేందుకు ఉపయోగించే ట్రాక్టర్లు, ట్రాలీని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అనేక శాఖల అధికారులు, డాక్టర్లు, కూటమి నాయకులు, కార్యకర్తలు, ఏఎన్ఎం ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ప్రకృతి వ్యవసాయంవైపు మరలుదాం



విశాలాంధ్ర - తాళ్ళరేవు : కాకినాడ జిల్లా తాళ్ళరేవు మండలం పి మల్లవరం పంచాయతీ ప్రాంగణంలో జరిగిన రైతు గ్రామ సభలో కరప సబ్ డివిజన్ అసిస్టెంట్ అగ్రికల్చర్ అధికారి కే బాబూరావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి రైతు భూమాతను కాపాడుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని, ప్రతీ ఒక్కరూ ప్రకృతి వ్యవసాయం వైపు మరలాలని, క్రమేపీ రసాయనాలు, ఎరువులు వాడకాన్ని తగ్గిస్తూ కాషాయాలు, ఘన, ద్రవ జీవామృతంలు అలవాటు చెయ్యాలి అని ఈ విధంగా సుమారు 5 సంవత్సరాలు పాటు చేయగలగితే తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు తీయవచ్చు అన్నారు. సర్పంచ్ పంపన రామకృష్ణ మాట్లాడుతూ మల్లవరం పంచాయతీలో రైతులు ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమం నిర్వాహకులు కృషి అమృత్ గోవు ఆధారిత ప్రకృతి వ్యవసాయ క్షేత్రం రైతు ధూళిపూడి వెంకట రమణ (బాబి) మాట్లాడు తూ గత సంవత్సరం కాలంగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులు మరికొంత మంది రైతులును ప్రోత్సహించాలన్నారు. ప్రకృతి వ్యవసాయం చేసిన రైతులు దడాల సత్తికొండ, రాయుడు సింహాచలం, బాదం ఏడుఊ, అబ్బిరెడ్డి నాగేశ్వరరావు, పేరాబత్తుల భైరవమూర్తి, విళ్ళ సత్యనారాయణ, రాంబాబు, పేరాబత్తుల వెర్రి బాబులను ఘనంగా సన్మానించారు. మామిడి మొక్కలు, విత్తనాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపిసియన్ఎఫ్ సిబ్బంది యంటి ధనలక్ష్మి, సంధ్య, రమణీ, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

మాక్ డ్రిల్ ఆపరేషన్

విశాలాంధ్ర - అమలాపురం : ఆపరేషన్ సింధూర్, భారత్ పాక్ ఉద్రిక్తతల నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు ఎస్ యానాంలో పోలీసు, రెవెన్యూ, మెరైన్, వేదాంత కంపెనీ అధికారుల మాక్ డ్రిల్ ప్రజల యొక్క భద్రతాపై అవగాహన కల్పించారు. డాఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ ఆదేశాల ప్రకారం సంఘ విద్రోహ చర్యలను అడ్డుకోవడం, శాంతిభద్రతలు కాపాడటం, ప్రజల్లో భద్రతా భావాన్ని పెంపొందించడం ఈ డ్రిల్ యొక్క ప్రధాన లక్ష్యం. అత్యవసర పరిస్థితుల్లో పోలీసులు, ఇతర శాఖల సమ న్వయంతో చేపట్టే చర్యలను వివరించారు. ప్రజలు భయపడకుండా అప్రమత్తంగా ఉండాలని, ఏదైనా అనుమానాస్పదంగా ఉంటే వెంటనే పోలీసులకు సమాచారం యివ్వాలని అధికారులు కోరారు. ఈ మాక్ డ్రిల్‌లో అమలాపురం రూరల్ సిఐ ప్రశాంత్ కుమార్, ఓడలరేవు మెరైన్ సిఐ ఉప్పలగుప్తం ఎస్ఐ రాజేష్, తహసీల్దార్ వీఎస్ దివాకర్, రెవెన్యూ అధికారులు అధికారులు, వేదాంత కంపెనీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఓఎన్‌జీసీ క్షేత్రం వద్ద మాక్ డ్రిల్

విశాలాంధ్ర - మామిడికుదురు : భారత్-పాకిస్తాన్ మధ్య నెలకొన్న యుద్ధ వాతా వరణం నేపథ్యంలో ప్రజలకు అవగాహన కల్పించేందుకు మాక్ డ్రిల్ ఉపయో గపడుతుందని ఓఎన్‌జీసీ అధికారులు పేర్కొన్నారు. శుక్రవారం కోనసీమ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నగరం గ్రామంలో ఓఎన్‌జీసీ క్షేత్రం వద్ద మాక్ డ్రిల్ నిర్వహించారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలను సురక్షితంగా ఏ విధంగా తీసుకుని రావాలి అనేదానిపై అవగాహన కల్పించారు. దేశ భద్రత దృష్ట్యా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మార్గదర్శకాలు పాటించాలని, సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేయరాదని సూచించారు. బ్లాక్ ఔట్ వంటి పరిస్థితులు తలెత్తితే రాత్రి వేళల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తారని, జనరేటర్, ఇన్వర్టర్, వంటివి వినియోగించకుండా ఉండాలని ప్రజలకి అవగాహన కల్పించారు.

బాల్య వివాహాలపై అవగాహన

విశాలాంధ్ర-పెరవలి : బాల్య వివాహాలపై ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని కానూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యురాలు తేజశ్రీ అన్నారు. శుక్రవారం మండలంలో కాకరపర్రు, తీపర్రు గ్రామాలలో అంగన్వాడీ కేంద్రాల వద్ద శుక్రవారం కిషోర్ వికాశం కార్యక్రమం నిర్వహించడం జరిగింది. తీపర్రు గ్రామంలో జరిగిన కార్యక్రమంలో తేజశ్రీ పాల్గొని కిషోర్ బాలికలకు అనేక విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ, ఆరోగ్య శాఖల సిబ్బంది, స్థానిక బాలికలు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీ :వృద్ధుడి మృతి

విశాలాంధ్ర - కరప : కరప మండలం గొర్రిపూడి గ్రామానికి చెందిన ఎర్రం నీడి సత్య నూకరాజు(69) సంవత్సరాలు శుక్రవారం గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతి చెందాడని నూకరాజు కుమారుడు కరప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో నూకరాజు మృతిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని కరప ఎస్ఐ టి సునీత పేర్కొన్నారు. మృతుడు నూకరాజు మతిస్థిమితం లేక బయట తిరుగుతూ ఉంటాడని, తిరిగి మరల ఇంటికి వస్తూ ఉంటాడని, శుక్రవారం తలకు గాయమై రోడ్డు పక్కన పడి ఉండడంతో అదే గ్రామానికి చెందిన ఒంటె వీర గణేష్ చూసి మృతుడి కుమారుడికి ఫోన్ చేయగా వచ్చి చూసేసరికి చనిపోయి ఉన్నాడని గుర్తించి కరప పోలీసులు వారికి తెలియపరచామని ఫిర్యాదులో పేర్కొన్నారు.

దేశం కోసం ప్రాణాలర్పించిన వీరుడు మురళి నాయక్

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు దేగా ప్రభాకర్

విశాలాం ధ్ర -ఏలూరు: దేశం కోసం తన ప్రాణాలను సైతం తృణప్రాయంగా అర్పించిన ధీరుడు మురళి నాయక్ అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు దేగా ప్రభాకర్,ఏలూరు ఏరియా కార్య దర్శి ఉప్పులూరి హేమశంకర్ శుక్రవారం ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. భారత నియంత్రణ రేఖ వద్ద జరిగిన యుద్ధభూమి లో మురళి నాయక్ అసాధారణ ధైర్య సాహసాలు ప్రదర్శించారని కొని యాడారు. విపత్కర పరిస్థితులలో పోరాడుతున్న సమయంలో ఎదు రైన ప్రతికూల పరిస్థితులలో కూడా వెనుకాడకుండా ముందుకు సాగిన ధైర్యశాలి అన్నారు. వీరుడిగా దేశం కోసం చేసిన త్యాగం పట్ల గర్వంగా ఉందన్నారు. దేశం కోసం ప్రాణాల ర్పించిన తెలుగు బిడ్డ కోసం ప్రతి భారతీయుడు గర్వపడే సమయం అన్నారు. మురళి నాయక్ చేసిన త్యాగం దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు.దేశ రక్షణ కోసం ప్రాణాలర్పించిన అమర వీరుడు మురళి నాయక్ కు ఘనంగా నివాళులర్పిస్తున్నామని తెలిపారు.దేశం కోసం ఆయన చేసిన అత్యున్నత త్యాగం ఎప్పటికీ స్ఫూర్తినిస్తుందని పేర్కొన్నారు.మురళి నాయక్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

ఆర్వోబీ పనులు పూర్తి చేయాలి : మంత్రి కందుల

విశాలాంధ్ర - నిడదవోలు : నిడదవోలు రాజమండ్రి మెయిన్ రైల్వే లైన్‌పై గూడెం గేటు వద్ద నిర్మిస్తున్న ఆర్‌ఓబీ(రైల్ ఓవర్ బ్రిడ్జ్) పనులను రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి వర్యులు కందుల దుర్గేష్ శుక్రవారం పరిశీలించారు. ఈ పనుల యొక్క పూర్తి వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. స్థానిక ప్రజలతో పాటు చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలు రాజమండ్రి, తాడేపల్లిగూడెం, ఏలూరు, కొల్లేరు ప్రాంతాలకు రాకపోకలు సాగించేందుకు వున్న అనువైన రోడ్డుమార్గమే తాడేపల్లిగూడెం గేటు మార్గం. ఈ మార్గంలోని రైల్వే లైన్‌పై ఆర్‌ఓబి నిర్మాణ పనులను ప్రభుత్వం చేపట్టింది. నిర్మాణ పనులు చేస్తుండటంతో ఈ మార్గంలో వాహనాల రాకపోకలకు కొంత అంతరాయం ఏర్పడుతుంది. నిర్మాణ

పనులను పరిశీలించిన కందుల దుర్గేష్ త్వరిత గతిన పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్త సమ్మె

విశాలాంధ్ర - కాజులూరు : కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 20న దేశవ్యాప్తంగా సమ్మె నిర్వహించేందుకు ఏపీ కౌలు రైతుల సంఘం పిలుపునిచ్చింది. కాకినాడ జిల్లా కాజులూరు మండలం శీలలంక గ్రామంలో జరిగిన కార్యక్రమంలో, కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి వళ్ల రాజాబాబు మాట్లాడుతూ, కేంద్రంలో ఉన్న ప్రభుత్వం శ్రమజీవులను అణగదొక్కే కొత్త చట్టాలు తీసుకొస్తూ, కార్మికులపై పని భారం పెంచుతుందని, అదేవిధంగా ఉపాధి హామీ పథకానికి నిధులు తగ్గిస్తూ పని దినాలు పడిపోతున్నాయని ఆయన తెలిపారు. రాష్ట్రంలో ఉన్న అధికార, ప్రతిపక్ష పార్టీలు కేంద్ర ప్రభుత్వంపై పోరాడవలసి ఉండగా ఏ ఒక్క పార్టీ మాట్లాడకపోవడం చాలా దురదృష్టకరమన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 20న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని, ఈ సమ్మెలో పేదలు, ప్రజలు, రైతులు, కార్మికులు పాల్గొనవలసిందిగా ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బూడితి ప్రభాకర్ రావు, ఇసుక పట్ల సుబ్రహ్మణ్యం, మాకా రామారావు, కౌలు రైతులు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

భారత్ జవాన్‌లకు సెల్యూట్ : మంత్రి

విశాలాంధ్ర -నూజివీడు: పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్‌లో ఉగ్రవాద శిబిరాలపై భారత త్రివిధ దళాలు నిర్వహించిన 'ఆపరేషన్ సిందూర్' సాహసోపేత చర్యగా నిలిచిందని రాష్ట్ర గృహనిర్మాణ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి పేర్కొన్నారు. నూజివీడు సబ్ కలెక్టరు కార్యాలయ సమావేశం మందిరంలో మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ పహల్గాంలో పర్యాటకుల మీద దాడి చేసి 26 మంది మరణానికి కారణమైన ఉగ్రవాదులకు సంబంధించి పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోని శిబిరాలపైన ఈ ఆపరేషన్‌లో భారత సైన్యం, నావికాదళం, వైమానిక దళం

సమన్వయంతో ఖచ్చితమైన దాడులు చేసి, ఉగ్రవాద సంస్థ జైష్ ఏ మొహమ్మద్ ప్రధాన కార్యాలయాన్ని, వారి శిబిరాలను ధ్వంసం చేశాయన్నారు. భారత జవానులు చేసిన పోరాటం చరిత్రలో సువర్ణ అధ్యాయంగా నిలిచిందని సెల్యూట్ చేస్తున్నానన్నారు. భారతదేశం ఉగ్రవాదంపై ఎంత కఠినంగా వ్యవహరిస్తుందో మరోసారి స్పష్టం చేశాయన్నారు. భారత సైనికులు ధైర్య సహసాలు యువతకు దేశభక్తిని మరింత పెంచాయన్నారు. కేంద్ర ప్రభుత్వం త్రివిధ దళ అధిపతిలతో కలసి ఎటువంటి నిర్ణయం తీసుకున్నను వారికి మనమంతా బాసటగా నిలవాలన్నారు.ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టరు బచ్చు స్మరణ్ రాజ్,అర్బన్ హౌసింగు యస్.యం. కృష్ణయ్య,హౌసింగు పిడి జి.సత్య నారాయణ, డిఆర్డిఏ పిడి ఆర్.విజయరాజు, జిల్లా, మండల వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధిలో సుభాష్ కృషి : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - ఆలమూరు : గ్రామ పంచాయతీని అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చేయడంతో పాటు రాష్ట్ర ఉత్తమ పంచాయతీ అవార్డు సాధనలో సర్పంచ్ సంగిత సుభాష్ చేసిన అవిశ్రాంతమైన కృషి ప్రత్యేక అనుభూతిని కలిగిస్తుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, జనసేన పార్టీ నియోజక వర్గ ఇంచార్జ్ బండారు శ్రీనివాస్, ఓఎన్జీసీ ఈడీ సంతాన దాస్ కొనియాడారు. పినపళ్ల గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఓఎన్జీసీ సహకారంతో శుక్రవారం చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి సర్పంచ్ సుభాష్ అధ్యక్షత వహించగా ఎమ్మెల్యే బండారు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఉమ్మడి జిల్లా చరిత్రలో ముందు పెన్నడూ లేని విధంగా రాష్ట్ర స్థాయిలో పేదరిక నిర్మూలన, అందరికి ఉపాధి

కల్పన అనే అంశాలపై అవార్డు సాధించడం గర్వకారణ మన్నారు. పినపళ్ల గ్రామ ప్రతిష్టను జాతీయ స్థాయికి తీసుకువెళ్ళిన ఘనత సర్పంచ్ సుభాష్‌కే దక్కుతుందన్నారు. గ్రామాన్ని 1.98 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేయడమే కాకుండా పారిశ్రామిక ప్రగతిని ప్రోత్సహించి అనేక మందికి ఉపాధి సౌకర్యాలు కల్పించడం, పారిశుద్ధ్య చర్యలు చేపట్టడం అభినందనీయమన్నారు. అదేవిధంగా గ్రామ మౌలిక సదుపాయాల కల్పన గురించి ఎంఎల్ఏ బండారు అడిగి తెలుసుకుని నిధుల మంజూరుకు తమ వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఓఎన్జీసీ సహకారంతో సుమారు రూ. 10 లక్షల వ్యయంతో చెత్తను తరలించేందుకు కొనుగోలు చేసిన ట్రాక్టర్ అండ్ ట్రాలీని ఎమ్మెల్యే బండారు ప్రారంభించారు. అనంతరం రాష్ట్ర స్థాయి ఉత్తమ గ్రామ పంచాయతీ అవార్డు సాధించిన సర్పంచ్ సుభాష్‌కు ఘన సత్కారం జరిగింది. ఎంఎల్ఏ సత్యానందరావు, జనసేన నేత శ్రీనివాస్, ఓఎన్జీసీ ఈడీ సంతాను దాస్ ఆధ్వర్యంలో గ్రామస్తుల సర్పంచ్‌కు పూల మాలలు వేసి, శాలువా కప్పి, మెమొంటోను బహుకరించి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పలు శాఖల అధికారులు, ఓఎన్జిసి సిబ్బంది, పలువురు ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాధ్యులు ఎవరు?

విశాలాంధ్ర - కడియం : కడియం మండలం, వేమగిరి గ్రామం, కొత్తపేట ప్రాంతం, పోతురాజు నగర్ లో డ్రైనేజీ స్లాబ్ ప్రమాదభరితంగా మారింది. గ్రామంలోని నాలుగు అంతర్గత రోడ్లు కలిసే ఈ ప్రాంతంలో మధ్యగా డ్రైనేజీ వుంది. దానిపై వున్న స్లాబ్ రోడ్డు మధ్యలో పగిలి గత కొన్ని నెలలుగా ప్రమాదంగా దర్శనమిస్తుంది. గ్రామ పంచాయతీ అధికారులకు సమస్యను తెలియపర్చగా తూతూ మంత్రంగా చర్యలు చేపట్టి చేతులు దులిపేసుకుం టున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. గతంలో గ్రావెల్ లారీలు ఈ రోడ్డుమీదుగా తిరిగేవని స్థానికులు అడ్డుకోవడంతో నిలిపుదల చేశారన్నారు. ప్రస్తుతం అధికలోడుతో నర్సరీలకు సంబంధించిన భారీవాహనాలు తిరుగుతున్నాయని, దీంతో డ్రైన్ స్లాబ్ రోజురోజుకూ కృగిపోతుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇదే కూడలిలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ కేంద్రం

కిరాణాషాపు ఉన్నాయి. రోజంతా అధిక శాతం ప్రజలు ఈ కూడలి గుండా మసులుతుంటారు. అలాగే జగనన్న కాలనీకి ఇదే ప్రధాన రహదారి. ఇంత జన సంచారం, అనేక అధిక ప్రాధాన్యతలు వున్న ఈ రోడ్డులో ప్రమాదం పొంచి వున్నా కనీసం అధికారులు స్పందించక పోవడాన్ని స్థానికులు తప్పుబడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు మొద్దునిద్ర, నిర్లక్ష్యం వీడి సమస్య శాశ్వత పరిష్కారానికి కృషి చేయాలని, అప్పటి వరకూ తాత్కాలిక రక్షణ చర్యలు చేపట్టాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

వింత వాతావరణంతో ప్రజలకు ఇక్కట్లు

విశాలాంధ్ర, కొవ్వూరు : కొవ్వూరులో నాలుగైదు రోజులుగా వింత వాతావరణం చోటు చేసుకుంటుంది. ఉదయం నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు భగభగ మండే ఎండ ఆపై వుక్క పోత.. అయితే మధ్యాహ్నం రెండున్నర సమయానికి ఒక్కసారిగా ఆకాశం మేఘావృతం కావడం, అనంతరం పెద్ద ఉరుములతో కూడిన శబ్దాలు రావడం వీటితోపాటు రెండు గంటల పాటు కుంభ వృష్టిగా భారీ వర్షం కురుస్తుంది. భారీ ఈదురు గాలులకు అనేక ప్రాంతాల్లో చెట్లు నేలకు ఒరుగుతున్నాయి ఒకసారి వీటివల్ల ప్రమాద ఘటనలు జరుగుతున్నాయి. అదేవిధంగా పట్టణంలోని రోడ్లన్నీ వర్షపు నీటితో మునిగిపోతున్నాయి. డ్రైన్లు పొంగిపొర్లుతున్నాయి దీంతో వాహన చోదకులతోపాటు ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. 4:30 తర్వాత వాతావరణం తెరిపిచ్చి చల్లబడుతుంది. రెండు రోజుల క్రితం దీప్తి స్కూల్ వద్ద ఒక చెట్టు విరిగిపడటంతో ఒక వ్యక్తి మృతి చెందిన ఘటన జరిగింది. అదేవిధంగా భారీ గాలికి విద్యుత్ వైర్లు తెగి పడుతున్నాయి. దీంతో విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నారు. ఇది సమస్యగా తయారవుతుంది. రాత్రిపూట కరెంట్ లేక ప్రజలు అల్లాడుతున్నారు అదేవిధంగా మర్నాడు ఉదయం ఎనిమిది గంటల నుంచి భానుడు తన ప్రతాపం చూపిస్తున్నాడు ఈ నేపథ్యంలో ప్రజలతో పాటు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.